

# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



81

## పండ్రెండవ అధ్యాయము - భక్తి యోగము

**1. ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే**
**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః**

**వ్యాఖ్య :** 'ఏవమ్' అను పదము క్రిందటి అధ్యాయము యొక్క 55వ శ్లోకమగు 'మత్కర్మకృత్' అను శ్లోకము యొక్క భావమును సూచించుచున్నది.

భగవానుని విశ్వరూపమునుగాని, లేక దైవసంబంధమైన వేఱొకమూర్తినిగాని, సాకార స్వరూపమునుగాని, అనవరత భక్తితో, ఉపాసించువారు (సగుణోపాసకులు) గొప్పా? లేక ఇంద్రియములకు గోచరముకాని, నిరాకారమైన, సర్వవ్యాపకమైన, అక్షర పరమాత్మను ధ్యానించువారు (నిర్గుణోపాసకులు) గొప్పా? అని అర్జునుని ప్రశ్న. ఇదివఱలో అనేకమార్లు భగవానుడు (2వ అధ్యాయము 8వ అధ్యాయము మున్నగుచోట్లు) నిర్గుణ పరమాత్మ యొక్క తత్త్వమును గూర్చి, ధ్యానమును గూర్చి తెలిపియుండిరి. ఇప్పుడు విశ్వరూపమునుజూపి, సుగుణోపాసనను బలపఱచిరి. కావున రెండింటిలో ఏది శ్రేష్ఠమను భావము అర్జుననకు కలుగుట సహజమే అయియున్నది -

**2. మయ్యావేశ్య మనో మే మాం నిత్యయుక్తా ఉపాసతే**
**శ్రద్ధయా పరయోపేతా స్తేమే యుక్తతమా మతాః.**

**వ్యాఖ్య :** అర్జునుని ప్రశ్నకు భగవానుడు చక్కటి సమాధానమొసంగిరి. సుగుణోపాసకులు శ్రేష్ఠులా? నిర్గుణోపాసకులు శ్రేష్ఠులా? యను ప్రశ్నకు ఎవరైనను సరియే మిక్కిలి శ్రద్ధతో గూడుకొని నిరంతరము దైవాయత్తచిత్తులైయుందురో వారే శ్రేష్ఠులని శ్రీకృష్ణుడు ప్రత్యుత్తరమొసంగిరి. ఇచట మూడు సాధనలు చెప్పబడెను.

(1) మనస్సును పరమాత్మయందు నిలుపుట.
(2) నిరంతరము దైవచింతనాపరులై యుండుట.
(3) మిక్కిలి శ్రద్ధతో గూడుకొనియుండుట.

ఈ మూడింటిని అనుష్ఠించువాడెవడో అతడు సర్వశ్రేష్ఠుడగు యోగిగాని, సగుణోపాసకుడా, నిర్గుణోపాసకుడా, సన్న్యాసియా, గృహస్థుడా, ద్విజుడా, ద్విజేతరుడా - అను ప్రశ్నయే ఇచట లేదు. ఆహా! భగవాను డెట్టి విశాల భావమును ప్రకటించిరి! భక్తికి, శ్రద్ధకు, ఏకాగ్రతకు, ప్రాధాన్యమొసంగిరే కాని ఒకానొక మార్గమునకు, సంప్రదాయమునకు గాదు.

**3. యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే**
**సర్వత్రగమచిన్త్యం చ కూటస్థమచలం ధ్రువమ్**

**4. సంనియమ్యేన్ద్రియ గ్రామం సర్వత్ర సమబుద్ధయః**
**తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః.**

**వ్యాఖ్య :** ఒకే పరమాత్మ సాకారముగను, నిరాకరముగను ఉండుటవలన, సగుణ ధ్యానమునకుగాని, నిర్గుణ ధ్యానమునకు గాని లక్ష్యము ఒకటియే అయియున్నది. శ్రద్ధతోను, నిర్మలభక్తితోను ఏ ప్రకారము ధ్యానించినను జనులు పరమాత్మనే చేరుదురు. ఈ రెండు శ్లోకములందును నిర్గుణపరబ్రహ్మమును ధ్యానించువారిని గుఱించి చెప్పబడినది. ఇందు మొదటి శ్లోకమున బ్రహ్మమును గూర్చిన విశేషణములున్ను, రెండవ శ్లోకమున బ్రహ్మప్రాప్తికి వలసిన శీలసంపత్తియు తెలుపబడినవి. సాధకుడు సాధ్యవస్తువగు పరమాత్మను ధ్యానించుచున్నప్పటికిని, హృదయశుద్ధి లేనిచో, ఇంద్రియ నిగ్రహము గల్గియుండనిచో, ప్రాణికోటి యెడల దయలేనిచో ఆ ధ్యానము చక్కని ఫలితము నొసంగజాలదు. అట్టి వానికి బ్రహ్మానుభూతి కలుగుట దుస్తరము. అతని ఉపాసన కళాయిలేని పాత్రలో వండిన పప్పుపులుసువలె నుండును. వస్తువులన్నియు మంచివి అయినను పాత్ర శుద్ధముగా లేనిచో ఆ పులుసెట్లు చిలుమెక్కిపోయి నిరుపయోగమగునో, అట్లే హృదయశుద్ధి, ఇంద్రియ నిగ్రహము, భూతదయ మున్నగు పవిత్ర గుణములు లేక భగవంతుని నిరాకారమునగాని, సాకారముగగాని యెట్లుపాసించినను పూర్ణఫలితము కలుగదు. కనుగనే గీతాచార్యులు ధ్యానశీలురను హెచ్చరించుటకు కాబోలు, ధ్యాతకు వలసిన మూడు గొప్ప సుగుణములను ఇచట నిర్గుణబ్రహ్మోపాసనా ఘట్టమున పేర్కొనిరి. అవి యేవియనిన -

(1) ఇంద్రియ సమూహమును లెస్సగ అరికట్టుట (సంనయమ్యేన్ద్రియ గ్రామం)
(2) ఎల్లెడల సమభావము గలిగియుండుట (సర్వత్రసమబద్ధయః)
(3) సమస్త ప్రాణులకు హితమునాచరించుట (సర్వభూతహితేరతాః)

కాబట్టి ముముక్షువులు ధ్యానాదులను సల్పుచు ఈ సుగుణత్రయమును అలవఱచుకొనవలెను. ఇచట 'నియమ్య' అని చెప్పక 'సంనియమ్య' అని చెప్పుటవలన ఇంద్రియములను ఒకింత నిగ్రహించిన చాలదనియు లెస్సగ నిగ్రహించవలెననియు, 'సర్వత్ర' అని పేర్కొనుటవలన సమస్త ప్రాణులందును, లేక ఎల్లకాలమందును సమభావము గలిగియుండవలెననియు, 'సర్వభూతహితేరతాః ' అని చెప్పుటచే ఏ ఒకానొక ప్రాణియెడల దయగలిగియుండుట చాలదనియు, సమస్త ప్రాణికోట్ల యెడ ప్రేమ, దయ, ఉపకారబుద్ధి గలిగియుండవలెననియు స్పష్టమగుచున్నది. ఈ ప్రకారములగు సుగుణములు గల్గి పరమాత్మను ధ్యానించుచో వారు తప్పక ఆ పరమాత్మను జేరగలరని 'తేప్రాప్నువన్తి' అను వాక్యముచే భగవానుడు నిశ్చయపూర్వకముగ తెలుపుచు సర్వులకును అభయమొసంగుచున్నారు. కావున భగవద్ధ్యానపరుడు పై మూడు సుగుణములను తనయందున్నవా, లేవాయని పరీక్షించుకొనవలయును.

**5. క్లేశోఽధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే.**

**వ్యాఖ్య :** నిర్గుణోపాసనామార్గము దేహాభిమానముగలవారికి చాలా ప్రయాసగా నుండునని యిచట తెలుపబడినది. అది లేనివారికి చాల సులభముగనుండును. అనగా దేహాహంభావములేక, ఇంద్రియనిగ్రహముగలిగి, నిష్కామకర్మానుష్ఠానము చేతను, ఈశ్వరోపాసనచేతను చిత్తశుద్ధిని బడిసినవారికి నిర్గుణోపాసనయందేమియు కష్టముండదు. ఈ శ్లోకము యొక్క మొదటి పాదమునందు నిర్గుణోపాసన అధికతరక్లేశవంతమై యుండునని చెప్పుట దేహాభిమానముగలవారికే యనియు, ఇంద్రియ నిగ్రహము లేనివారికే యనియు, సుగుణోపాసనచే చిత్తశుద్ధిని బడయనివారికే యనియు గ్రహించవలెను. దేహాభిమానము లేనివారికి, ఇంద్రియ నిగ్రహము కలవారికి నిర్గుణ మార్గము అతి సులభముగనున్నదై జీవుని పరమాత్మ సాన్నిధ్యమునకు తప్పక చేర్చగలదని వెనుకటి శ్లోకములందు భగవానుడు చెప్పియే యుండిరను విషయమును ఈ సందర్భమున జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను.

- (తరువాయి వచ్చే సంచికలో)

కృష్ణా! నీ వదనమున కస్తూరీ తిలకం, నెమ్మిగ రొమ్మున కౌస్తుభమణి, నాసికం (ముక్కు) చివర ముత్యం, చేతికి కంకణం, మరో చేతిలో వేణువు శరీరమంతా చందనం, మెడలో ముత్యాలపేరు ధరించి, గోపికలచే పట్టుబడి ఉన్న గోపాల చూడామణీ! కృష్ణా! నీవెంతగా పరవశింపచేస్తున్నావయ్యా

అందెలు సందడి చేసే సుందరవదనా! చేతితో కాలు పట్టుకుని నోటిలో వేలు పెట్టుకుంటూ మర్రి ఆకు మీద ముద్దుగా పడుకున్న బాలముకుందా నిన్ను చూచి ముకుళిత హస్తంతో ముగ్ధుణైపోతున్నానయ్యా - అంటూ -

**కరారవిందేన పదారవిందం**
**ముఖారవిందే వినివేశ యంతం**
**వటస్య పత్రస్యపుటే శయనం**
**బాలం ముకుందం మనసా స్మరామి!**

బాలకృష్ణుణ్ణి సంతోష తన్మయత్వంతో తలచుకుని మురిసిపోవడం కృష్ణావతారంలోని విశిష్టత! నారాయణతీర్థుల వారు కృష్ణుని చిట్టి చిట్టి అడుగులతో నడుస్తూ, గోపబాలురతో గోకులంలోని వీధి వీధికి ఇంటి ఇంటికి వెడుతూ, వారి యిండ్లలోని నెయ్యి, వెన్న, పాలు, పెరుగు జుర్రుతూ, గోప బాలుర మూతులకు వ్రాసే చిలిపి చేష్టలకు మురిసిపోతూ నారాయణతీర్థులను ఓ మహత్తరమైన సుందర ప్రపంచంలో నోలలాడిస్తున్నట్టు కీర్తించారు. ఈ కీర్తనం ఆంధ్రలోకానికి ముఖ్యంగా రసజ్ఞులైన భక్తులకు విదితమే!

**కృష్ణం కలయసుఖి సుందరం ॥బాల॥**
**కృష్ణంగత విషయతృష్ణం జగత్ప్రభ**
**విష్ణం సురారిగణ జిష్ణం సదా ॥బాల॥**
**నృత్యంత మిహమహం రత్యంత మపరిమిత**
**భృత్యానుకూల మఖిల సత్యం సదా ॥బాల॥**
**ధర భవ జలధిసారం సకల వేద**
**సారం సమస్తయోగితారం సదా ॥బాల॥**
**శృంగార రసభర సంగీత సాహిత**
**గంగాలహరి ఖేల సంగం సదా ॥బాల॥**
**రామేణ జగదభి రామేణ బలభద్ర**
**రామేణ సహావాప్త కామేవ సదా ॥బాల॥**
**రాధారుణాధర సుధానం సచ్చిదానందం**
**రూపం జగత్రయ భూపం సదా ॥బాల॥**
**దామోదర - మఖిల కామాకరం ఘన**
**శ్యామాకృతి మసుర భీమం సదా ॥బాల॥**
**అర్ధం శిథిలీకృతా నర్థం శ్రీనారాయణ**
**తీర్థ పరమ పురుషార్థం సదా ॥బాల॥**



- నారాయణతీర్థులవారి పద సౌరభం మనసును మనిషిని కృష్ణుని చరణారవిందములపై ముగ్ధుడయ్యేట్టు చేస్తుంది. కృష్ణ భక్తి రసంతో ఆపాదమస్తకమూ భక్తి రంజిల్లింపచేస్తూ పునీతుల్ని కావిస్తుంది. ఇంతకూ సంస్కృతంలో ఇంతసొంపుగా తెలుగుదనముట్టిపడేట్టు కీర్తించిన నారాయణ తీర్థులవారు తెలుగువారు కావడం తెలుగువారి అదృష్టం. గుంటూరు జిల్లా 'కాజ'లో 17వ శతాబ్దం చివరికాలంలో జన్మించిన తల్లావఝుల గోవిందశాస్త్రిగారే నారాయణతీర్థులని గర్వంగా చెప్పుకుందాం.

**సీతాపతే రామ, రాధాపతే కృష్ణ శ్రీ రుక్మిణీ, సత్యభామా పతే నమః**
**ఇరువురు కృష్ణులున్నట్టుగా బ్రహ్మ వైవర్త పురాణం బట్టి తెలుస్తుంది!**

బ్రహ్మ వైవర్త పురాణంలోని బ్రహ్మఖండం ద్వితీయాశ్వాసంలో మూడు అత్యంత ఉన్నతమైన లోకాలను గురించి ప్రస్తావిస్తూ, ఈ లోకాలన్నిటిపైనా అత్యున్నతమైన లోకం గోలోకంఉందని, అక్కడే పరమాత్ముడూ, ఆదిదేవుడైన గోలోక కృష్ణుడున్నాడనీ, ఆయన దేవాదిదేవుడనీ ప్రస్తుతిస్తూంది.

గోలోక కృష్ణుడే అన్ని అవతారాలకూ ఆద్యుడూ, ఆదిదేవుడని వక్కాణించింది. ప్రళయకాలం వచ్చి సమస్త లోకాలూ, దేవతలూ, కోట్లాది జీవరాశులూ నశించిననూ, స్థిరంగా ఉండేది ఆ గోలోక కృష్ణుడే! ఆయనే పునఃసృష్టి చేసి విశ్వాన్ని పంచభూతాల సహితంగా ఉద్ధరిస్తాడనే విషయం తెలుస్తూంది. అంతర్జాతీయ కృష్ణ సంఘం (ఇస్కాన్) కూడా కృష్ణుడే ఆదిదేవుడనీ, ఆయనే అన్ని అవతారాలను ధర్మసంస్థాపనార్థంగా అవతరిస్తూ వచ్చాడని విశ్వసిస్తూంది.

అంతటి మహోజ్వల దివ్యలోక పరంధామాన్ని గోలోక కృష్ణ పరమాత్ముడు తన దివ్యయోగశక్తితో ధారణ చేసాడని, అక్కడ వ్యాధులకుగానీ, వృద్ధత్వమూ, జన్మ, మృత్యు శోకాల భయం వంటి విపత్తులకు గానీ స్థానం ఉండదని బ్రహ్మవైవర్త పురాణం రొఖ్ఖాయించినట్టు చెప్పింది.

గోలోకం చేరడం అంత సులభమైనది కాదు. మనిషి ఉత్తమ సాధకుడై, గొప్ప పుణ్యాత్ముడూ, ధర్మాత్ముడూ, జన్మరాహిత్య స్థితిని పొందినవాడే వెళ్ళగలడు. పరమ పవిత్రమైన ఆ గోలోకం మండలాకారంగా మూడుకోట్ల యోజనాలు విస్తరించియున్నది. నేలంతా చిన్మయరత్నమైనది. యోగులు సహితము ఆ లోకాన్ని స్వప్నంలో కూడా దర్శించలేరు. గోలోక కృష్ణుని అనన్య కరుణ పొందినవారే అక్కడకు చేరగలరు. గోలోకానికి అధోభాగంలో యాభై కోట్ల యోజనాల దూరంలో దక్షిణ భాగమందు వైకుంఠం, వామ భాగంలో శివలోకం విరాజిల్లు తూంటుంది. వైకుంఠం లోక విస్తీర్ణం కోటి యోజనాల మేర ఉంటుంది. ఈ వైకుంఠధామంలో శ్రీ మహాలక్ష్మీ సమేతుడైన నారాయణుడు విరాజిల్లుతూంటాడు. వారితో చతుర్భుజులైన శ్రీ మహావిష్ణువు పార్షదులుంటారు. జన్మజరా మృత్యు బాధలు లేనివారుగా ఉంటారు. అదేవిధంగా శివలోకం కూడా కోటి యోజనాల మేర విస్తరించి ఉన్నది. ఆ లోకంలో ఉమాసమేతుడైన సదాశివుడుంటారు.

గోలోక కృష్ణుడు కోటానుకోట్ల సూర్యప్రభా సమాన తేజో కిరణ కాంతితో దివ్యతేజోమయంగా ఉంటాడు. ఆ నిత్యజ్యోతిర్మండలమే అసంఖ్యాక లోకము లేర్పడడానికి కారకమవుతుంది. ఆ గోలోకం నడుమ అత్యంత ప్రకాశవంతమైన దివ్యజ్యోతి ప్రకాశిస్తూం టుంది. ఆ తేజోవంతమైన జ్యోతి కాంతుల మధ్యలో మహామహా సుందరాకారుడూ, సచ్చిదానంద స్వరూపుడైన పరంధాముడు శ్యామలవర్ణ శరీరం, శరత్కాలంలో వికసించే కమలాలవంటి నేత్రాలూ, శరత్ పూర్ణిమ చంద్రికను మించిన కాంతితో ముఖబింబం ప్రసన్నంగా ప్రకాశిస్తూంటుంది. ఆ రూప లావణ్యానికి ఎందరు మన్మథుల సౌందర్యమూ సాటిరాదు. ఆయన ద్విభుజధారి. చేతుల్లో మురళి, పెదవులపై మందహాసం, శరీరంపై రత్నమయ భూషణాలు, శ్రీవత్సాలంకృతమైన వక్షస్థలమ్మీద దివ్య కౌస్తుభం, శిరస్సుపై మేలురత్నమైన స్వర్ణమకుటం నెమలి ఫింఛాలతో అలరారుతూ, రత్నఖచితమైన సింహాసనమ్మీద ఉపవిష్టుడై, శ్యామల కోమలవర్ణుడైన పరంధాముడైన శ్రీకృష్ణుడుంటాడు. ఆయన మెడలో వనమాల, హారాలూ ఉంటాయ్. గోలోకంలో గోలోకకృష్ణుడు తక్క మరెవరూ పరంధాములుండరని వ్రాస్తే, మరికొందరు కృష్ణచైతన్య భక్తులు గోలోక ఆధిపత్యం రాధాదేవిదేననీ ఆమె అపురూప సౌందర్యరాశియనీ, ఆమె అన్ని అవతారములలోకీ శ్రేష్ఠమైన అవతారమనీ, ఆమె ఉన్నచోట సుఖసంతోషాలు సిరులొలుకుతూ ఉంటాయనీ, కృష్ణుని కోసమే ఆమె అవతరించిందనీ, శ్రీకృష్ణుడు ఆమెనెపుడూ విడిచి ఉండకుండా ఆరాధిస్తాడని, ఇరువురి శరీరములూ ఏకమై, ఒకే స్వరూపం రాధాకృష్ణులుగా ప్రేమసాస్వాదనాద్యులనీ, కృష్ణుని సర్వసమూ రాధపైననే ఆధారపడియుందనీ స్వచ్ఛమైన, సత్యమైన ప్రేమ ఆ ఏకమనస్కుల నుంచే ప్రారంభమైందనే ఓ ప్రత్యేక చరిత్ర ఉన్నది. వారు భూలోకంలో మధురలోని దేవకీ వసుదేవుల యింట కృష్ణుడు జన్మించి, రేపల్లెలోని యశోదానందులకు పుత్ర ప్రేమ పంచి, బాల్య యవ్వనములనంతా రాధతో బృందావనంలో గడిపాడంటారు. బృందావనం రాధాకృష్ణుల ఆనంద నందిత బృందావనం, యమునాతీరమంతా వారి జ్ఞాపకాలతో నిండి, తన్మయుల్ని చేస్తుంది. కృష్ణుడు యశోదా కుమారునిగా అలరించే సమయానికి ముందే రాధ మధుర సమీపంలోని బర్సానాదామ్‌ను పాలించే కీర్తి వృషభానుల పుత్రిక. రావల్ గ్రామంలో అంతరిక్షం నుంచీ చిన్న బాలికగా క్రిందికి దిగింది. కీర్తి, వృషభానులు ఆమెను తీసుకుని వెళ్ళి పెంచుకున్నారు. ఒకవిధంగా చూస్తే రాధకృష్ణుని కన్నా వయసులో పెద్దది. ఒకసారి రాధ పిల్లవానిగా ఉన్న కృష్ణుణ్ణి ఎత్తుకుని ఓ వనం గుండా వెడుతూన్నప్పుడు కృష్ణుడు యువకునిగా మారి, రాధ ప్రేమ రసామృతాన్ని జుర్రుకున్నాడట, రెండు చేతులా ఘట్టిగా పట్టి చేతుల్లో బంధించి చుంబించాడట. ఆ వనం పొలిమేరలు దాటి రేపల్లెలో ప్రవేశించుసరికి పిల్లవాడుగా మారిపోయాడట. ఇలాటి లీలలన్నిటినీ గోలోక కృష్ణుడు బృందావనంలో చూపించాడు. రాక్షసులను పసివయసులోనే సంహరిం చాడు. గోపికా రాసకేళి కాళిందుని మదనం బాలలీలలు అన్నీ జరిపింది గోలోక కృష్ణుడే! బృందావన లీలలన్నీ గోలోక కృష్ణుని బాల్య, కృష్ణ లీలా దర్శనమంతా వ్రజ భూమి బృందావనం, మధురల్లో, గోపగోపికా పరివేష్టిత జనంతో కూడి ఆనందిస్తూ, ఆనందింపచేస్తూ, అందరికీ ఆనందం పంచాడు. పాండవచెలిమి, కురుక్షేత్ర సంగ్రామంలోనూ, గీతోపదేశ గీతాచార్యుని గానూ గోలోక కృష్ణుని అంశ తొలగి, నారాయణాంశతో, నరుడైనా, అర్జునునితో రెండవ కృష్ణ పాత్ర మహా ప్రస్థానం వరకూ జరిగిందని ఓ పురాణం విదితపరుస్తుంది. **(సశేషం)**

**('గోపురం' హరిద్రా కుంకుమల అధినేత దయాగుణశీలి వై.వి.హరికృష్ణ, తిరుమల, తిరుపతిల్లోని WOODSIDE అధినేత, కృష్ణభక్తిప్రియుడు కృష్ణభట్ - ఈ వ్యాస ప్రేరేపకులు.)**

# నిజాయితీకి నిలువెత్తు మనిషి!


## బ్రాహ్మణులతో కూడి హరిజనుల సేవలందించిన వేముల కూర్మయ్య!

చదువూ, సంస్కారం లేకుండా, రికామీగా తిరిగే మనుష్యులంటే కూర్మయ్యకు కిట్టేది కాదు. ప్రతీ ఒక్కడూ చదువుకోవాలి. స్వతంత్రంగా ఆలోచించే శక్తి కలిగి ఉండాలి. పరనింద, ఆత్మస్తుతిలను ప్రక్కకు నెట్టాలి. తరతమ బేధాలను విడనాడాలి. ఎవరి వృత్తులను వారే చేసుకోవాలి. ప్రతీ వాడూ వర్గపోరాటాల వ్యసనపరుడు కానే కాకూడదు. త్రాగుడు అలవాటును మానుకోవాలి. రైతు కూలీల మధ్య సదవగాహన, సఖ్యతలుండాలి. సమాజ శ్రేయస్సు కోరేవాడే నిజమైన దేశభక్తుడు. ఇది కూర్మయ్య విధానం.

అంబేత్కర్ వంటి సర్వసమాజ సమైక్యతా ప్రియుడు వేముల కూర్మయ్య. ఆరోజుల్లో హరిజనుల్లో బాగా చదువుకున్నవాడు. పట్టభద్రుడు. సర్వసమాజ సంక్షేమాన్ని కోరుతూ, హరిజనులు స్వశక్తితో సంఘటితంగా విద్యావంతులుగానూ, శక్తివంతులుగనూ ఎదగాలని, అవిశ్రాంతంగా ఆ వర్గాల్నే గాకుండా, అగ్రవర్ణాలవార్ని కూడా పొరుపొచ్చాలు లేకుండా శాంతిసామరస్యాలతో ఉండాలని కోరుకున్న కూర్మయ్య వేముల కూర్మయ్య నిస్వార్ధమనస్కుడై, నిరాడంబరంగా సమాజ హిందూ మత సిద్ధాంతాల ప్రాతిపదికగా సమాజ కృషి చేసిన హరిజన నాయకుడు.

ఆనాడు హరిజనులను ఎడంగా ఉంచడం, దేవాలయ ప్రవేశాలకు అనుమతించకపోవడం ఉండేది. అంటరానితనం ఉండేది. పెద్ద కాపుల ఎదురుగా చెప్పులతో నడవరాదు, చుట్టలు, కాల్చరాదు. ఊరి పాఠశాలలందు కలిసి చదువుకో రాదు. నిరక్షరాస్యులు నిశానీదారులుగానే ఉండాలి. ఇది స్వాతంత్ర్యానికి ముందు 1920 దశకం లోని దారుణ పరిస్థితి.

కోస్తా ఆంధ్రా జిల్లాల్లో, కృష్ణాగుంటూరు జిల్లాల్లో ఎంతోమంది పండితులు, రచయితలు, పత్రికా రచయితలైన బ్రాహ్మణులు హిందూ సమాజంలోని అస్పృశ్యత, అవిద్య, అంటరానితనం రూపుమాపడానికి దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, బులుసు సాంబమూర్తి, ప్రకాశం పంతులు, వంటి జనహితైష నాయకులు, ఈ హరి జనోద్ధరణను ప్రధాన పరిష్కార విషయంగా తీసుకున్నారు. వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి, అందరిలా దేవాలయ ప్రవేశం చేయడానికీ, వారికి సహకార సంఘాలు, సేద్యవసతులు కల్పించడానికి ఎన్నో ఎన్నెన్నో కార్యక్రమాలను చేబట్టారు. హరిజనుల్లో కూడా ఆత్మోద్ధరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆడా మగా చదువుకోవడానికి హైదరాబాదులో ఆది ఆంధ్ర సంఘం అను పేరుతో భాగ్యరెడ్డి వర్మగారు ఉద్యమం చేబట్టారు. హరిజనుల కోసం ప్రత్యేక పాఠశాలలు, వసతి గృహాలు ప్రారంభించారు. కోస్తా ప్రాంతాల్లోని పెద్దల అండదండలతో హరిజనులు స్వయంకృషితో ఉద్యమాల ద్వారా సంఘటిత శక్తితో ఉపాదులు సంపాదించుకోకలిగారు. కొందరు రచయితలుగా, కొందరు నాయకులుగా దేశసేవా పరాయణత్వంలో భాగస్వాములయ్యారు. అటువంటి స్వయం కృషీవలత్వంతో అంచెలంచెలుగా పైకి వచ్చినవాడే వేముల కూర్మయ్య.


1903 - 1970

కృష్ణాజిల్లాలోని గుడివాడ తాలూకా మల్లవరం గ్రామంలో నిరుపేద కుటుంబంలో 1903వ సంవత్సరంలో జన్మించాడు. పాఠశాలలో మేధావంతుడైన మంచి విద్యార్థిగా విద్యార్జనం చేస్తూ బి.ఏ. పట్టభద్రుడయ్యారు. అంతటితో కూర్మయ్య చదువు ఆగలేదు. కాశీలోని హిందూ విశ్వవిద్యాలయంలో బి.ఎల్. డిగ్రీని అందుకున్నారు. ఆనాడు మదనమోహన మాలవ్యా వారణాశి హిందూ విశ్వవిద్యాలయాన్ని – దేశంలో కల హిందూ విద్యాలయాల్లో ఉన్నతంగా ఉండేట్టు, శీలవంతులైన విద్యార్థులుగా విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దారు. ఆ విద్యాలయంలో విద్యనభ్యసించిన కూర్మయ్య, మాలవ్యా ఆశయాలకు తగ్గట్టుగా సత్య, శీల, సౌహార్ధ్రతలతో తీర్చిదిద్దబడ్డారు. తరువాత పూర్తికాలం సమాజోద్ధరణకు కృషి చేసారు. 1929 సం॥ములో విజయవాడలో జరిగిన 8వ ఆది హిందూ మహాసభలో పాల్గొనడంతో కూర్మయ్య పేరు. తెలివితేటలు, నిస్వార్ధసేవ, నిరాడంబర జీవితం ప్రాచుర్యంలోకి వచ్చింది.

1932వ సం॥ములో దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు స్థాపించిన హరిజన సంఘానికి సంయుక్త కార్యదర్శిగా కూర్మయ్య నియమితు లయ్యారు. అప్పట్నుంచీ కూర్మయ్యగారి జీవితం అభ్యుదయ పథంలో సాగింది. 1936 సం॥ములో విజయనగరంలో జరిగిన 11వ ఆది హిందూ ఉద్ధరణ సభకు సభాధ్యక్షత వహించారు.

1930 సం॥ములో ఉప్పు సత్యాగ్రహంలోనూ, 1940 సం॥ములో వ్యక్తి సత్యాగ్రహోద్యమంలోనూ పాల్గొని కారాగారశిక్షకు గురయ్యారు. 1935 సం॥ నుంచీ అనేక పర్యాయములు మద్రాసు శాసనసభకూ, తదుపరి ఆంధ్రప్రదేశ్ శాసనసభకూ ఎన్నికయ్యారు. మద్రాసు ఉమ్మడి రాష్ట్ర మంత్రివర్గంలో హరిజన సంక్షేమ శాఖా మంత్రిగా పనిచేసారు.

కూర్మయ్య ఆదర్శప్రాయుడైన దేశసేవకునిగా, నిజాయితీ నిబద్ధతతో పనిచేసారు. ఎవరిచేతనూ వేలెత్తి చూపబడని సత్యగుణశీలుడు. హరిజనులు స్వశక్తితో విద్యావంతులుగా, సంఘటితంగా శక్తిమంతులు కావాలనీ, సన్మార్గంలోనే సంపన్నులుగా ఎదగాలి గానీ అక్రమ ఆర్జనాపరులు కారాదు అంటూనే అగ్రకులాలను ద్వేషించడంగానీ, దూషించడం గానీ చేయరాదనీ, హిందూమత ధర్మపరులుగా సఖ్యత, సమైక్యత, శాంతి, అహింస, క్షమాగుణములతో సమాజంలో పేరెన్నిగనాలని హితోక్తులు పలుకుతూ, తాను ఆచరించి చూపారు. దీర్ఘకాలం శాసనసభ్యునిగా ఉన్నప్పటికినీ, మంత్రిగా ఉన్నప్పటికినీ తనకంటూ ఏంటీ సంపాదించుకోలేదు. అక్రమ సంపాదనలు చేయలేదు. వక్రమార్గాలు పట్టలేదు. పార్టీలు మార్చలేదు. గ్రూపు రాజకీయాలకు పోలేదు. ఇంతటి కర్మిష్టుడని మరొకర్ని రాష్ట్రచరిత్రలో చూచి ఉండము. 1970 సం॥ములో రాజకీయాల్లో చక్రాలు తిప్పే వారొస్తున్న కలిదోష కాలాన్ని చూడకుండానే జూన్‌లో వారు దివంగతులు కావడంతో, నీతిమంతుల శాతం తగ్గుతూ వస్తుంది. సచ్చరిత్రుల్ని స్మరించుకోనే సంప్రదాయాన్ని విస్మరించాం.

కూర్మయా! ఎక్కడున్నా మీ ఆత్మశాంతిగా ఉండాలని కోరుకుంటున్నామయ్యా! ●

Lovely Stay at Holy Tirupathi The Gateway of Lord Balaji

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"

# అ-అ ల ఆదర్శ దాంపత్యం - ఆత్మీయ అనుబంధం!

## - అక్కినేని నాగేశ్వరరావు - అన్నపూర్ణల ఆదర్శ అన్యోన్యత -



సెప్టెంబర్ 20వ తేదీ వచ్చేసరికి ఆంధ్రుల అభిమాన సినిమా కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు పుట్టినరోజు. చలనచిత్ర అభిమానులందరికీ పరువపు పర్వదినంగా ఆనందం పంచుతుంది. తొమ్మిది పదుల వయసు అంచుల్లో ఉన్నప్పటికినీ, ఆయన నటన పసతగ్గలేదు. చేతికర్ర అవసరం అసల్లేనే లేదు.

ఆయన విజయాల వెనుక ఆయన భార్య అన్నపూర్ణ బలం, అదృష్టం, ఉత్ప్రేరణా ఉంది. 'సీతారామజననం' చిత్రంలో ఘంటసాల బలరామయ్య శ్రీరాముని పాత్ర యిచ్చి, బలం చేకూర్చడం వల్లనో యేమో అక్కినేనికి 'సీత' వంటి 'అన్నపూర్ణ' భార్యగా లభించింది. ఇది పెద్దలు చేసిన పెళ్ళే! ఏ సుముహూర్తమో అయ్యుండాలి. కానిచో అరవైయేళ్ళ పై చిలుకు అనుకూల దాంపత్యం ఆనందమునిచ్చేది కాదు.



వయసులో గానీ
నడకలో గానీ
నవ్వులు రువ్వడంలోగానీ
'దసరాబుల్లోడు' గానే
కనిపిస్తారు.

సినీమా కథానాయకుల్లో ఇంతటి అన్యోన్య ప్రేమగల ఆదర్శ దంపతులను వారెవరూ లేరు! అన్నపూర్ణే ఆ యింటి గౌరవాన్నీ, ఐశ్వర్యాన్నీ, ఆయుర్దాయ, నైతిక శక్తినీ నాగేశ్వరరావుకు కల్పించిందంటే ఏమాత్రమూ అత్యుక్తి కాదు. సిరి సంపద, సంతాన సంపద, సినిమా సంపద వంటి అష్టైశ్వర్యాలూ సంపాదించి పెట్టిన ఆ సీతమ్మ తల్లి ఇటీవలే 'లవకుశ'లోని సీతమ్మలా భూగర్భంలోకి వెళ్ళిపోయింది. ఆ౦విడెంతటి అ'తిథి' మర్యాదస్తురాలో నాకు బాగా తెలుసు. నిజం చెప్పాలంటే అన్నపూర్ణ, నాగేశ్వరరావు కన్నా గొప్పది, ఔదార్య గుణం కలది. నేనెప్పుడూ నాగేశ్వరరావు గారిని కలిసినా, అన్నపూర్ణగారి యోగక్షేమాలనే అడిగేవాణ్ణి.

నేను ఎన్టీయార్ అభిమానినైనా, అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్రనే వ్రాసాను. ఆయన రాజా అణ్ణాపురంలో ఇంటి గృహప్రవేశం చేసినప్పుడు వేంకటేశ్వరస్వామి రజిత పటం తీసుకుని వెళ్ళాను. ఆయన్ను నాస్తికుడంటారు గానీ ఆస్తికుడే! హైదరాబాదులో ఆయన నిర్మించిన అన్నపూర్ణ స్టూడియోస్ ప్రారంభానికి వెళ్ళాను. ఆయన కరచాలనం చేస్తూ – 'జాగ్రత్త మీరు అమాయకులు; చెయ్ యిచ్చేవారుంటారు' అన్నారు – అప్పుడు మా 'సినీరమ' ప్రతినిధి శరత్‌కుమార్ అక్కడే ఉన్నాడు. ఆయన తొలుత అమెరికా వెళ్ళి తిరిగి వచ్చినప్పుడు నేను ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆంధ్రా ఫిలిమ్ జర్నలిస్టు అసోసియేషయన్ తరఫున, శ్రీ ఇంటూరి వేంకటేశ్వర రావు సహకారంతో పూర్ణకుంభ స్వాగతం, పూర్ణాహార విందు నేర్పాటుచేసి సత్కరించాను. ఇలా అన్నీ ఎందుకు చేసానో నాకే ఆశ్చర్యం! అంతర్గతంగా ఉన్న ఓ అభిమానం, ఆ దంపతులపై నాకున్న గౌరవం. అన్నపూర్ణ గత సంవత్సరంలో పరమపదించడంతో అక్కినేని శరీరార్ధ భాగం పోయినట్లు కుమిలిపోయారు. సీతావియోగం శ్రీరామచంద్రుని ఎలా తల్లడిల్లిన చేసినదో అక్కినేని హృదయం కూడా అలా తల్లడిల్లింది. రామాంశాగుణసంశోభితుడైన అక్కినేని అన్నపూర్ణ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం తెనుగు సీమ చరిత్రలో స్వర్ణ చరిత్రగా చెప్పుకోవాలి. బాటసారి, విప్రనారాయణ వంటి చిత్రాల్లో మరల నటించాలి అంటే అక్కినేని మాత్రమే అర్హుడు. అక్కినేని ఒక శకాకారకుడు కావాలి.

## సతీమణి అన్నపూర్ణను గుండెల్లో దాచుకొన్న గుణశీలుడు

**రవికిరణం తాకనిదే నవకమలం విరిసేనా**
**మధుపం తను తాకనిదే మధురం మురిసేనా**
**మేనుమేను తాకనిదే-మనసు మనసు కలవనిదే**
**మమత లేదు – మనుగడ లేదు** – ఓ సినిమా కవి ఏ సినిమాలో అన్నాడో గుర్తులేదు. పాట పంక్తులు గుర్తున్నాయ్.

అన్నపూర్ణ అక్కినేని నాగేశ్వరరావులు చిలుకా గోరువంకల్లా కలిసిమెలసి కలుపుగోలు తనం పెంచుకున్న ఆదర్శ దంపతులు. వారి అన్యోన్య సంతానంలో ఆడపిల్లలు ఎక్కువే! ఆ కారణంగా మనుమలు తాతా అమ్మమ్మలతో సుశిక్షణంలో తేనెపాలు మిశ్రమంల్లా కుటుంబంలో తియ్యదనాలను పంచుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావుకు పిల్లలంటే ఎంత ప్రేమో, సతీమణి అన్నపూర్ణపై అంత ప్రేమాగౌరవం. ఆయన గానీ, ఆయన కుమారులుగానీ ఏ సంస్థ ప్రారంభించినా అన్నపూర్ణ పేరుననే ప్రారంభించారు.


శ్రీరాముని నాయక పాత్రతో జీవితం ప్రారంభించి నందుకేమో అన్నపూర్ణపై నాగేశ్వరరావు 'సీత' వంటి గౌరవం ఉంచారు. దశరథరాముడు అశ్వమేధ యాగం చేస్తూ, స్వర్ణసీత ప్రక్కన ప్రతిష్ఠించుకున్నట్టా – నానుండి నీవు దూరం కాలే(దు)వు సుమా అన్నట్టు అన్నపూర్ణా స్టూడియోస్‌లో అన్నపూర్ణ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించిన తరువాతనే అమెరికా వెళ్లారు. తొమ్మిది పదుల వయసులో కూడా ఆయన నవ్వితే బుగ్గలు సొట్టలవుతాయ్. ఇప్పుడు హీరోయిన్లతో స్టెప్‌లు వేయమన్నా వేయగల చలాకీ ఉంది. 2012 సెప్టెంబర్ 20న జరిగే అక్కినేని పుట్టినరోజు అమెరికాలో జరుగుతున్నది.

కృతజ్ఞతా భావం గల అక్కినేని తన హృద్రోగానికి (దశాబ్దాల క్రితం) శస్త్రచికిత్స చేసి పునర్యవ్వనం కల్పించిన అమెరికా వైద్యుణ్ణి సువర్ణ కంకణంతో గౌరవించడమెంతయేని మేలు మనసుకు నిదర్శనం. సతీమణి అన్నపూర్ణ కాంస్య విగ్రహాన్ని స్వయంగా ప్రతిష్టించిన అక్కినేని సీతారాముడనే భావిస్తూన్నా, మరో 90 ఏండ్లు వృద్ధత్వం లేని మన్మధునిలా చెలువొందాలని అభినందిస్తూన్నాను.

**– గోటేటి**

## ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభల సంపాదకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, నటుడు

# నీలంరాజు శేషయ్య



ఆరడుగుల అందగాడు, గెడకర్రంత పొడుగాటి సన్నమొనగాడు. అచ్చంగా హీరో నాగేశ్వరరావులా ఉండేవాడు, అడుగులు తడబడే వయసులో, తల్లి శిక్షణలో సంస్కృతము నేర్చుకున్నవాడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆంతరంగిక వ్యక్తి, స్వాతంత్ర్యోద్యమ పిపాసి, ఆంధ్ర పత్రిక, సంపాదకుడు నీలంరాజు శేషయ్య అంటే అందరికీ పరిచయం. 'ఉషాపరిణయం' చిత్రంలో అనిరుద్ధునిగా నాయక పాత్ర ధరించాడంటే ఎంత మందికి ఎరుక అనేది సందేహం.

అయితే కంచి పరమాచార్య అనుంగు శిష్యునిగా, అంకిత భక్తునిగా 'నడిచేదేవుడు' అనే గ్రంథం వ్రాసారంటే ఆస్తికులందరికీ అవగాహన ఉంటుంది. తెలియనివి మరికొన్ని చదవండి.

నేనంటే శేషయ్యగారికెంతో ఇష్టం ఉండేది. ఆయనంత ఎరుపు నేను కాదుగానీ, ఆయనలానే పొడుగ్గా, గెడకర్రంత సన్నగా ఉన్న నేను ఆరువేల నియోగ దర్పంతో నన్నో 'సంపాదకునిగా' ప్రోత్సహించండని సరాసరి వెళ్ళి అడిగాను. ఆయనా తొలు దొల్త అలాగే అడిగినవాడైనందున నన్నేమనుకోలేదు. ఇంకొకడైతే 'గెటవుట్' అనే వారేమో! అనినా ఫరవాలేదు-అంతక్రితం ఒకరివద్ద ఆమాట అనిపించుకునే వెళ్లాను.

శ్రీ శేషయ్య శ్రీ అద్దంకి వెంకట్రామయ్యగారి ఇంట వుండి చదువుకుంటుండే వారు. వారాంతానికి స్వగ్రామమైన కొరిశపాడు (ఇది అప్పటికి అద్దంకికి హామ్లెట్ అట) వచ్చి తల్లిదండ్రులతో గడిపేవారు. తల్లి లక్ష్మమ్మకు తెనుగే కాక సంస్కృతం కూడా వచ్చును. ఆమె తన ప్రథమ సంతానమైన శేషయ్యకు కొద్దికొద్దిగా సంస్కృతం నేర్పడమే కాక, పిల్లవాడికి అద్దంకికి ఉత్తరం రాసి పంపదలుచుకుంటే సంస్కృతంలోనే రాసి పంపేవారు. పిల్లవాడికి ఆవిధంగా సంస్కృతం నేర్పాలనే ఆవిడ అభిలాష అసాధరణ విషయమేననుకోవాలి.

ఆయన తొమ్మిదేళ్ల వయసున్నప్పుడే ఆమె మరణించింది. ఆయన లేబ్రాయంలోనే ఆమె మరణించటం వల్లనైతేనేమి, సామాన్య మధ్యతరగతి కుటుంబాల స్త్రీలకన్నా ఉన్నత సంస్కారం కలిగుండడం వల్లనైతేనేమి, పిల్లవాడి మీద అమ్మ లక్ష్మి లక్ష్మమ్మ చెరగని ముద్ర వేసిందనే చెప్పవచ్చు. (ఆయన తండ్రి వేంకట సుబ్బయ్య నిష్ఠాగరిష్ఠుడు. సాధువు. దైవసంకీర్తనం మీద అభిలాష కలవాడు.)

శేషయ్యగారికి మొదట కలిగినది పుత్రసంతానం అవడం వల్ల, ఆమె పేరును ఈ పురుష నామంలోకి జతచేసి 'లక్ష్మీప్రసాద్' అని ఆమె పేరు కలిపి పెట్టుకున్నారు. ఆతర్వాత చాలాకాలానికి గానీ ఆయనకు స్త్రీ సంతానం కలగ లేదు. ఇరవై ఏళ్లు గడిచిన అనంతరం కూడా ఆ శిశువుకు లక్ష్మి అనే నామ కరణం చేశారు. పిలవడం మాత్రం లక్ష్మమ్మా అని పిలుస్తుండేవారు. లక్ష్మి వివాహ సందర్భంలో, లగ్న పత్రిక రాసే సమయాన పురోహితుడు వధూవరుల పేర్లు చెప్పమన్నప్పుడు, ఆయన తన కూతురు పేరు 'లక్ష్మమ్మ' అని స్పష్టంగా పలికారు.

సంతాన ప్రసక్తి వచ్చింది కాబట్టి, వివరాలు తెలియజేస్తాను. వారి తర్వాతి మగసంతానం ఇద్దరు. శ్రీ మురళీధర్, శ్రీ రవి ప్రభు, అటు తర్వాత స్త్రీ సంతానం ఇద్దరు. బి. లక్ష్మి, బి. శ్యామ. మురళీధర్ అవివాహితుడిగానే జీవించి తన 73వ ఏట (2008) లో గతించాడు. బి. రవిప్రభు, సిండికేట్ బ్యాంకు నుండి రిటైరై ఖమ్మంలో వుంటున్నాడు. బి.లక్ష్మి, తన భర్త చోడవరపు రంగశాయితో హైదరాబాద్ (కొండా పూర్)లో నివస్తోంది బి. శ్యామ, తన భర్త దామరాజు బాలసుబ్రహ్మణ్యం (రిటైర్డ్ సీనియర్ పోలీస్ ఆఫీసర్) హైదరాబాద్ (తిరుమలగిరి)లో నివసిస్తున్నారు.

భారత జాతీయోద్యమానికి గాంధీజీ నాయకత్వం వహించక ముందు, 'లాల్ బాల్ పాల్' అనే మూర్తి త్రయం అనగా అనే ముగ్గురి నాయకత్వ కాలంలో, దేశంలోని విద్యార్థులను ఉద్యోమంలో భాగస్వాములు చేయాలనే భావం కలుగలేదు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పనిచేసిన డాక్టర్ అనిబి సెంట్ కూడా, ఉద్యమాలలోనికి విద్యార్థులను తీసుకురాకూడదని అభిప్రాయపడింది. కానీ గాంధీజీ దృష్టిలో ఆంగ్ల పరిపాలన అంతమొందించడంతోపాటు, ఆంగ్ల పాలకులు భారతదేశంలో ప్రవేశపెట్టిన విద్యావిధానం కూడా అంతమొందించి, దాని స్థానే జాతీయ కళాశాలలద్వారా భారతీయ విద్యార్థులు జాతీయ భాషలలోనే విద్య నేర్వాలని అభిప్రాయపడ్డారు. ఈ భావాలు ఆనాటి యువతరాన్ని ఎంతగానో ప్రభావితం చేసినవి.



అక్కినేని అనుకుంటారేమో అనిరుద్ధునిగా నీలంరాజు

ప్రాథమిక పాఠశాల చదువు అద్దంకిలో పూర్తిచేసిన తర్వాత శేషయ్యగారు ఒంగోలు నగరంలో థర్డ్ ఫారమ్ వరకు చదివి, హైస్కూల్ చదువులకై బాపట్ల వెళ్లారు. అక్కడ ఐదవ ఫారం పాసయి ఆరో ఫారం (ఆ కాలంలో విద్యార్థులు ఆరవ ఫారం అయింతర్వాత ఎస్ఎస్ఎల్సి అనే పబ్లిక్ పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులైతే కాలేజీ చదువులకు అర్హత లభించేది) చదువుతుండగా 1920 సంవత్సరంలో గాంధీజీ ప్రారంభించిన అసహాయోద్యమం మేధావులను, విద్యార్థులను, అమితంగా ప్రభావితం చేసింది. ప్రభుత్వానికి చెందిన గ్రామోద్యోగులు సైతం తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి, గాంధీ ఉద్యమంలో పాల్గొన్నారు. గాంధీజీ పిలుపుననుసరించి బాపట్ల హైస్కూల్ నుండి బయటికి నడిచిన విద్యార్థులు, గాంధీ ఉద్యమాన్ని విరమించి నందువల్ల, ఆశాభంగం చెంది, దాదాపు అందరూ మళ్లీ స్కూలుకే వెళ్లారు. దేశభక్తి అతిబలీయంగా ఉన్న నలుగురు మాత్రం వెళ్లలేదు. అలా మానేసిన నలుగురిలో **శేషయ్య** ఒకరు.

బాపట్ల వదిలి ఒంగోలుకు వచ్చి, జాతీయ విద్య గఱపడానికి గాంధీజీ ప్రారంభింపజేసిన జాతీయ విద్యాలయంలో కొన్ని నెలలు చదువు కొనసాగించారు. ఈ జాతీయ విద్యాలయం టంగుటూరి ప్రకాశంగారి స్వగృహంలోనే నెలకొల్పారు. 1920 సహాయ నిరాకరణోద్యమ కాలంలో ప్రారంభమైన ఈ విద్యాలయం, దేశ సేవలో విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వడంలో చాలా తోడ్పడింది. ఇక్కడ వివిధ వృత్తి విద్యలలో శిక్షణ గఱపడం ద్వారా గ్రామీణ వృత్తులకు మంచి ప్రోత్సాహం కూడా లభించింది. బాల్యంలోనే సాంప్రదాయ విద్య, సాహితీ సాంప్రదాయాలలో శేషయ్యగారు సుశిక్షణం పొందారు. అదే ఆయన అభివృద్ధికి దోహదమైంది. **(సశేషం)**

# చిత్తశుద్ధి, నిస్వార్థతలతో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలకు శ్రమించిన శ్రీ వడ్లమాని సూర్యప్రకాశరావు

కీర్తిశేషులు వడ్లమాని సూర్యప్రకాశరావుగారు తూర్పుగోదావరి జిల్లా పేరూరి అగ్రహారము నందు 21-11-1939న సదాచార సంపన్నుడైన శ్రీవడ్లమాని కామేశ్వరరావు, బాలాత్రిపురసుందరి దంపతులకు జన్మించారు. వీరికి నలుగురు సోదరులు, ఒక సోదరి కలరు. సామాన్య మధ్యతరగతి కుటుంబములో జన్మించిన శ్రీ ప్రకాశరావు గారు సాధారణ విద్యతో తృప్తి చెందవలసి వచ్చింది. శ్రీప్రకాశరావు గారు తన 14వ ఏట నిత్యాగ్నిహోత్రులు, బహుయజ్ఞకర్త సార్ధక నామధేయులైన బ్రహ్మశ్రీ ఉపాధ్యాయుల సోమయాజులు దంపతుల కుమార్తె యైన "సీతామహాలక్ష్మి"ని వివాహమాడారు. అప్పటికి సీతామహాలక్ష్మి వయస్సు ఎనిమిది సంవత్సరములు. ఈ దంపతుల సంతానం ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు.



1957వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన శ్రీ ప్రకాశరావు గారు 1963లో దక్షిణ మధ్యరైల్వే నందు టైపిస్టుగా నూతనోద్యోగ జీవితాన్ని ఆరంభించారు. 1997వ సంవత్సరంలో వారు ద॥మ॥ రైల్వే నుండి పదవీ విరమణ పొందారు. ఉద్యోగదక్షతలో, కుటుంబ నిర్వహణలో సంస్కారవంతమైన బాధ్యతలను నిర్వర్తించిన శ్రీ ప్రకాశరావుగారి జీవితంలో 1976వ సం॥ములో ఆయన మదిలో ఒక సేవా భావ కోరిక మెదిలినది. బ్రాహ్మణ కుటుంబాలకు ఎదురయ్యే వివాహ సమస్య. నాటినుండి బ్రాహ్మణ సమాజంలో అత్యవసరమైన కుటుంబ సమస్యగా పరిణమించిన పిల్లల వివాహ నిశ్చయాలకు ఒక పరిష్కారం అందించాలనే వారి ఆలోచనలకు సహకారమందించి వెన్నుతట్టిన కీ॥శే॥ ఆత్మకూరి పూర్ణచంద్రరావు, యల్లంరాజు హరినారాయణ, ఆలూరి గోపాలకృష్ణమూర్తి, బ్రహ్మశ్రీ కె.వి. బలరాం, బ్రహ్మశ్రీ గోపాల కృష్ణమూర్తి, బ్రహ్మశ్రీ సేతువేణుగోపాల్, ఈనాటి బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్ర మార్గదర్శకులు. నాటి కుర్తాళం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ త్రివిక్రమ రామానంద భారతీస్వామి వారి అనుగ్రహ ఆశీస్సులతో, 1983 జనవరి 26వ తేదీన విజయవాడలోని హనుమాన్‌పేట, శంకరమఠం కార్యకర్తల సహకారంతో శ్రీ ప్రకాశరావుగారు "బ్రాహ్మణ వివాహ ఉచిత సమాచార కేంద్రం"ను స్థాపించారు. నాటినుండి నేటివరకు ప్రతి ఆదివారం ఈ కేంద్రం నందు బ్రాహ్మణ సమాజానికి సమాచారాన్ని అందిస్తూ తమ సేవాపరయాణతను చాటుకొని "బ్రాహ్మణ సమాజ ఆత్మబంధువు" అయినారు. వివిధ ప్రాంతాలలో బ్రాహ్మణ సమాజానికి వివాహ సమాచారాన్ని అందిస్తున్న బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్ర నిర్వాహకులందరినీ ఏకత్రాటిపైకి తీసుకొనివచ్చి, జాతీయ స్థాయిలో అఖిల భారత బ్రాహ్మణ వివాహ సమాచారాల కేంద్ర సమాఖ్యను ఏర్పాటుచేసారు, దేశ్వాప్త "వివాహ పరిచయవేదిక"లకు చక్కని రూపకల్పన చేసిన అవిశ్రాంత సేవాపరాయణులు ప్రకాశరావుగారే.

54 సం॥ల సుదీర్ఘ దాంపత్య సహజీవనంలో భర్తగా, కుటుంబపెద్దగా శ్రీ ప్రకాశరావుగారి పాత్రను సందర్భోచితంగా సమర్థించుకుంటూ, వారి సేవా కార్యక్రమాలకు నిరంతర సహకారాన్ని అందిస్తూ, కుటుంబ నిర్వహణను కడు సమర్థవంతంగా, నడిపించిన శ్రీ ప్రకాశరావుగారి ధర్మపత్ని శ్రీమతి సీతామహాలక్ష్మి 16.12.2007న పసుపు, కుంకుమలతో నిండు ముత్తయిదువుగా భగవత్సాయుజ్యము నొందారు. అర్ధశతాబ్దానికి పైగా జీవనయానంలో వెన్నంటి సహకరించిన సహధర్మచారిణిని పోగొట్టుకున్న శ్రీ ప్రకాశరావుగారు తీవ్రమైన దుఃఖసాగరంలో మునిగి సహచర కార్యవర్గ సభ్యుల ఓదార్పు, తోడ్పాడుటతో అనతి కాలంలోనే వారు తిరిగి బ్రాహ్మణ సమాజ సేవలో పాల్గొంటూ, అనేకమంది బ్రాహ్మణ బంధువులకు "సేవాభావాన్ని" ఉపదేశించి తరింపచేశారు. 2010 ఆగష్టు 14వ తేదీ సాయంత్రం మరుసటి రోజు జరుపవలసియున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై, శంకరమఠం ప్రాంగణంలో సహచర కార్యవర్గ సభ్యులతో చర్చిస్తున్న శ్రీ ప్రకాశరావు గారికి భగవంతుడు హఠాత్తుగా పిలుపునిచ్చాడు. సహచర కార్యవర్గ సభ్యుల వొడిలో అవిశ్రాంత సేవా సమరయోధుడు శాశ్వతనిద్రకు ఉపక్రమించగా, బ్రాహ్మణ సమాజం ఉలిక్కిపడింది. దేశవ్యాప్త సమాఖ్య సభ్యులను, సమాచార కేంద్ర కార్యవర్గ సభ్యులను శోకసంద్రంలో ముంచి, నాలుగు సంవత్సరాలుగా "కళ్యాణోపాధ్యాయుడు" శ్రీ ప్రకాశరావు గారు లేని లోటు తీర్చలేనిది. ఈ ఆగష్టు 14న వారిని పునస్మరణం చేసుకుంటూ బ్రాహ్మణ సంఘాలు నివాళులర్పించడం ముదావహం. ●

**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# - పేరిమి కల పెనుసరసమతులు! కలం పట్టిన కవితా గుణ కాణాచి రాజరాజనరేంద్రుని రాజమండ్రి! -
## - జంట కవితారమణుల జంటితేనె జర్రిరచట! -

రాజరాజ నరేంద్రుని రసరమ్య పాలనమో, నన్నయ్యభట్టారకుని అడుగులపై రేగిన దూసి దూసరమో, 'శ్రీవాణీగిరి జాశ్చ' అంటూ లక్ష్మి, సరస్వతీ పార్వతీమ తల్లులకు తొలి ప్రణతులర్పించడం వల్లనో, గోదావరీ పరివాహికంలో కోటి లింగాలు వెలసిన కారణమో, ఎరుగనుగానీ, పేరిమగల పెను సరసమతులచట కోటి కలములతో అక్కడి కోటిలింగాలకు కవితార్చన చేశారు. ఇందు కోమలులెందరో కలం పట్టి జంట కవయిత్రులుగా జుంటి తేనెవంటి తెలుగు అక్షరములతో కావ్యములల్లిన ప్రౌఢశైలి ప్రౌఢలెందరో, అక్కడి పుడమి రేణువులందు పుట్టగా 'ఓంఓం' అని వారి అక్షర సముచ్చయం ప్రణవ శబ్దంగా వినిపిస్తూనే ఉండడం గౌతమీ గోదావరీ తీర గడ్డ లక్షణం.

అక్షరముల చివర అక్షరమును అచ్చుతో ముగించగల అజంతా సౌలభ్యం ఒక్క తెలుగుకే ఉన్నట్లు కవయిత్రులే ముందుగా గ్రహించినట్లు తెలుస్తున్నది. తెలుగు అక్షఱ సౌందర్య సౌకుమారతలను స్త్రీ రచయితలే ఎక్కువగా ఆకళింపు చేసుకున్నారు.

'అత్యంత సుకుమారి, ఆంధ్రా భాషాయోష, ఆత్మీయ ముద్దు చెల్లి' అన్నందుకు శ్రీనాధుణ్ని వేమారెడ్డి భూపాలుడు విద్యాధికారి పదవిని కట్టపెట్టాడు. తెలుగు పలుకుబడిలోని పలుకులు అమోఘత – తరిగొండ వేంగమాంబ చేత జనం నాలుకపై సరససరళ పదాలతో భక్తిపూరితుల్ని చేసే శతకాల్ని రచింపచేసింది.

**తల్లి పేగు ప్రాణధార అయితే తల్లి భాష జ్ఞానధార!**

**(ప్రాణాధారమైన తల్లి భాషను మరిచి అన్యభాషల కొంగు పట్టాము కావుననే తెలుగు ప్రసాదించిన జ్ఞానధార వెలుగునూ, నీతిధార నిజాయితీని విస్మరిస్తున్నాం.)**

**ఆడపడుచు అర్ధమొగుడని మరిచి వదినా మరదళ్లు జంట కవయిత్రులైన ఘనత మన తెలుగువారిదే!** గిడుగు లక్ష్మీకాంతమ్మ, జొన్నలగడ్డ శారదాదేవి ఇద్దరూ వదినా మరదళ్లు. లక్ష్మీకాంతమ్మ రాజమండ్రి పట్టణంలో వక్కలంక చెల్లాయమ్మ – గవర్రాజు దంపతులకు 1903 సం॥ము ఫిబ్రవరి 3న జన్మించారు. వారిది పండిత వంశం. అయితే ఆమె ఎక్కువగా మేనమామల యింట్లోనే ఉండేవారు. రాజమండ్రిలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి వరకూ చదువుకున్నారు. తరగతిలో అన్నిటా మొదటి విజేతగా ఉండడం వలన విద్యార్థినులూ, ఉపాధ్యాయులూ ఆమెనెంతో ప్రేమగా చూచేవారు. పదవ తరగతిలోకి రాకుండానే ఆమెకు పెళ్లి నిశ్చయమైంది. వ్యావహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి పంతులుగారి అన్న కుమారుడు వేంకట రామమూర్తి గారితో వివాహం జరిగింది, విద్యాభ్యాసనకు ఆటంకం కలిగింది. ఆ వేంకటమూర్తిగారి సహోదరే జొన్నలగడ్డ శారదాదేవి. ఆమె భర్త జొన్నలగడ్డ సత్యనారాయణగారు ఎం.ఏ.ఎల్.టి. బి.యల్. చదివారు. బహుభాషా జ్ఞాని రచయిత. లక్ష్మీకాంతమ్మ భర్త వేంకట రామమూర్తి పాఠశాలల విద్యాధికారి. తరచు వారికి బదిలీలు అవుతూండేవి.

ఇతఃపూర్వమే వేంకట రామమూర్తి, భార్య లక్ష్మీకాంతమ్మనూ, సహోదరి శారదా దేవినీ సంస్కృత కావ్యాలు చదవడంలోనూ, తెలుగు కావ్యాలను అభ్యసించడంలోనూ ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహంతో వదినా మరదళ్లు స్వయంశక్తిని పెంచుకుని అవధానాలను అవలీలగా చేసేవారు. ఇహ కావ్యరచనలూ, గ్రంథ రచనములూ చెప్ప పని లేదు. లక్ష్మీకాంతమ్మగారి భర్త 1942లో మరణించారు. అయినప్పటికినీ వదినా మరదళ్లు సాహితీ వ్యాసంగం విడిచిపెట్టలేదు. అటుతరువాత రెండు సంవత్సరాలకు శారదాదేవి అసువులు బాసింది. లక్ష్మీకాంతమ్మగారు సాహితీ ప్రవృత్తి రంగాన్ని విడనాడలేదు. సాహితీ సేద్యం కొనసాగిస్తూనే వచ్చారు. అప్పట్లో మద్రాసులోని కేసరీ కుటీరం వారు ఆమెను గృహలక్ష్మి స్వర్ణకంకణమిచ్చి సత్కరించారు. ఇప్పుడా సత్కారం లేదు.

ఈ జంట కవయిత్రులు ఏ రచన చేసినా ఇరువురి నామధేయములుండేట్టుగానే గ్రంథ రచయితల పేరు పెట్టేవారు. లక్ష్మీ శారదా గీతములు, లక్ష్మీశారదా శతకములు, లక్ష్మీ శారదా సుభాషితములు. ఇలా వారు జంట సమైక్యతకు భిన్నం రానిచ్చేవారు కారు. వీరిరువురి రచనల్లోనూ 'హితబోధ' మిక్కుటముగా ఉండేది. సులభగ్రాహ్యమగునట్టు సుందర తెలుగున కవితను చెప్పేవారు.

**ఆర్తిని చెందు బీదలకు నన్నము వెట్టుచు దృప్తిజేసి, నీ**
**భర్త మనోగతంబులగు భావములే గత భావసించితంబొ? ననుగావగ నీ మది చింత లేదొకో?**
**సతతమునంత వంతలవి స్వాంతమున నన్ గృశియింపచేసే – నీ**
**వితరణమేల జూపవిక? లేవగలేనిక శారదా పతీ!**

– విధి నిర్వహణ కారణంగా తనకు దూరంగానున్న భర్తను ఉద్దేశించి:


**వనటను జెందనేల, మణి వారిజనేత్ర విదేశమందునన్**
**దనయుల బంధుమిత్రులను దారను వీడియు నొంటి నుంచి నంచనయము చింత మానుమిక**
**నా జగదీశుని ప్రేమ కల్గినన్ శనిగిని**
**యేమిసేయు నక నందియ మేలను శ్రీ మనోహరా!**
**వేగమెవత్తు నంచిటకు బ్రీతి లిఖించిన పద్యరత్నముల్**
**నేగనుచున్ బఠింప విని యెంతయు నీదగు ముద్దుబిడ్డలున్**
**న్నే గడియున్ దలంచుచును నెప్పుడు వచ్చెద రమ్మయంచుమీ**
**యాగము నంబుకై ఎదురునందరు చూచుచు నుందం నిత్యమున్!**

దూర ప్రాంతాలకేగిన అమ్మో, నాన్నో ఎప్పుడొస్తారని ఎదురుచూడడమనే దానిలో ఏ తేడా లేదని ఈ పద్యం ఎంతగానో అందంగా, ఆర్ద్రంగా చెబుతూన్నది.

లక్ష్మీ శారదా శతకములను, లక్ష్మీకాంతమ్మ రెండుగా రచించారు. ఒకదాని యందు 'రమాపతీ' యనీ (తాను లక్ష్మీకాంత కదా) రెండవది 'శారదాపతి'యని (తన నెచ్చెలి ఆడపడుచు శారదకదా) – ఆ చందం ఈ పద్యగంధమున కందాం:

**చక్కని పాయసం ఒనగజెల్లెడి నీ కథలే వినుగ, నీ**
**చక్కని నామమేను మనసార గ్రోలగ గల్గుచున్, సదా**
**మక్కువ దీరనాడు మన మారగ సంతసమందుచుండగా**
**తక్కిన వేల్పులెందుకు ధారుణి నాకిక. శ్రీరమాపతీ!**

– యని లక్ష్మీకాంతమ్మ వ్రాస్తే – శారదాదేవి రచించిన శతకము జేసిన **మనమున శాంతిని పొందలేదు. నాకు, నా గత భావ సంచికంబొడినను గానగ నీ మదిచింత లేదొకొ సతతమనంత వంతలవి స్వాంతముననన్ గృశియింపచేసి, నీ వితరణమేల జూపదిక! వేడగ లేనిక శారదాపతీ** – యని జొన్నలగడ్డ శారదాదేవీ 'లేఖాదూతం'గా కావ్యరచనను పూనుకుని రసాత్మకంగా ప్రత్యేకతను సంతరించుకునేలా రచించారు. తిరుపతి వేంకట కవుల్లో తిరుపతి శాస్త్రిగారు గతించిన తరువాత కూడా చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు తిరుపతి వేంకటకవుల పేరు మీదటనే రచనల్ను కొనసాగించినట్లు, లక్ష్మీకాంతమ్మగారు శారదాదేవి గతించిన తరువాత కూడా లక్ష్మీశారదాదేవి గనే రచనలు కొనసాగించారు. ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ పొణకాలకనకమ్మల జంట కవిత్రులనంతరం పేరుగొన్నది ఈ ఇరువురు కవయిత్రులే. అయితే వీరి బాణి ప్రత్యేక బాణీ! ఎంతకాలమైనా స్పందింపచేయు బాణి! ●



# ఘంటసాల కంఠసాల నుంచీ హరికథను విన్నారా?

తెలుగువారికే కాదు, అటు యావత్సంగీత విశ్వానికీ ఘంటసాలగారి కమ్మని కంఠసాల పరవశింప చేసిందంటే – సరస్వతీ నారదుల వరప్రసాదితమే! హిందీ రంగంలో సాటిలేని మేటి గాయకులు మహమద్ రఫీ, ముఖేష్, మన్నాడే కిషోర్‌కుమార్, నౌషధ్ ఆలీ (సంగీత దర్శకుడు) వంటి వారెంతో 'వారెవ్వా' అంటూ ప్రశంసలమీద ప్రశంసలు కురిపించారు.

కర్ణాటక సంగీతం, అరెబిక్ సంగీతం, హిందుస్థానీ సంగీతం, లలిత సంగీత స్వర సంపుటికే గాకుండా సాంప్రదాయ హరిదాస సంస్కృతిని కూడా ఆయన ఔపోసన పట్టాడు.

1961 సం॥ములో ఆచార్య ఆత్రేయ దర్శకత్వాన నిర్మించిన 'వాగ్దానం' చిత్రంలో ఓ కథా సందర్భముగా 'హరికథ' వస్తుంది. ఇలాటి సందర్భాలు ఘంటసాల సంగీత కర్తృత్వంలో వచ్చినప్పుడు ఆయన వంగల పట్టాభి భాగవతార్‌కు అవకాశం యిచ్చేవాడు. కానీ దర్శకుడు ఆత్రేయ, సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు గార్లు ఘంటసాల ఆ హరికథాలాపన చేస్తే రక్తి కడుతుందన్నారు. వారి అంచనాలకు మించి ఘంటసాల ఆ హరికథను గానం చేసారు. ఒకసారి ఆ హరికథా మాధుర్యాన్ని ఆస్వాదించండి.

**శ్లోకం:**

**శ్రీనగజాతనయం సహృదయం చింతయామి సదయం**
**త్రిజగన్మ హోదయం శ్రీనగజాతనయం**

**వచనం:**

శ్రీరామభక్తులారా! ఇది సీతాకళ్యాణ సత్కథ. నలభై రోజుల నుంచి చెప్పిన కథ చెప్పినచోట చెప్పకుండా చెప్పుకొస్తున్నాను. అంచేత కించిత్తు గాత్ర సౌలభ్యానికి అభ్యంతరం ఏర్పడినట్లు తోస్తూంది. నాయనా! కాస్త పాలు, మిరియాలు ఏవైనా?

**కోరస్ :** చిత్తం. సిద్ధం.

**వచనం:**

భక్తులారా! సీతామహాదేవి స్వయంవరానికి ముల్లోకాల నుంచి విచ్చేసిన వీరాధివీరుల్లో... అందరినీ ఆకర్షించిన ఒకే ఒక దివ్యసుందరమూర్తి... ఆహా! అతడెవరయ్యా అంటే

**పాట:**

**రఘురాముడు రమణీయ వినీల**
**ఘనశ్యాముడు**
**రమణీయ వినీల తక ఘనశ్యాముడు**
**వాడు నెలరేడు సరిజోడు మొనగాడు**
**వాని కనులు మగమీల నేలురా**



**వాని నగవు రతనాల జాలురా**
**వాని జూచి మగవారలైన మైమరచి**
**మరుల్కొనెడు మరోమరుడు**
**మనోహరుడు రఘురాముడు!**
**సనిదని సగరిగరి రిగరి సగరి రిగరి సగగరి సనిదని**
**సగగరిస దని రిసనిద రిసనిద నిదపమగరి**
**రఘురాముడు...**
**సనిసా సనిస సగరి రిగరి సరిసనిసా పదనిసా**
**సనిగరి సనిస సనిరిస నిదని నిదసని దమప గామాదా**
**నినిని నిని నిని నిని పస పస పస పస**
**సపా సపా సపా తద్దిం తరికిటతక**
**రఘురాముడు రమణీయ వినీల ఘనశ్యాముడు**
**శభాష్... శభాష్...**

**వచనం:**

ఆ ప్రకారంబుగా విజయం చేస్తున్న శ్రీరామ చంద్రమూర్తిని అంతఃపుర గవాక్షము నుండి సీతాదేవి ఓరకంట చూచినదై... చెంగటనున్న చెలికత్తెతో...

**పాట:**

**ఎంత సొగసుగాడే మనసింతలోనె దోచినాడే**
**ఎంత సొగసుగాడే మోము కలువరేడే...**
**నా నోము ఫలము వీడే శ్యామలాభిరాముని చూడగ**
**నా మది వివశమాయె నేడే ఎంత సొగసుగాడే**

**వచనం:**

ఇక్కడ సీతాదేవి ఇలా పరవశమై యుండగా, అక్కడ స్వయంవర సభామంటపంలో జనకమహీపతి సభా సదులను చూచి...

**పాట:**

**అనియె నిట్లు ఓయనఘులారా! నాయనుగు పుత్రి సీత**
**వినయాధిక సద్గుణవ్రాత ముఖ విజిత లలిత జలజాత**
**ముక్కంటి వింటినెక్కిడజాలిన యెక్కటి జోదును నేడు**
**మక్కువ మీరగ వరించి మల్లెలమాల వైచి పెండ్లాడు...**

**వచనం:**

అని ఈ ప్రకారం జనకమహారాజు ప్రకటించగానే, సభలోని వారందరూ ఎక్కడివారక్కడ చల్లబడి పోయారట. మహావీరుడైన రావణాసురుడు కూడా 'హా ఇది నా ఆరాధ్య దైవమగు పరమేశ్వరుని చాపము. దీనిని స్పృశించుటయే మహాపాపము' అని అను కొనినవాడై వెనుదిరిగిపోయాడట. తదనంతరంబున

**పాట:**

**ఇనుకుల తిలకుడు నిలకడగల**
**క్రొక్కారు మెరుపువలె నిల్చి**
**తన గురువగు విశ్వామిత్రుని ఆశీర్వాదము తలదాల్చి**
**సదమల మదగజ గమనము తోడ**
**స్వయంవరం వేదిక చెంత**
**మదన విరోధి శరాసనమును**
**తన కరమును బూనినయంత**

**గీత పద్యం:**

**ఫెళ్లుమనె విల్లు గంటలు ఘల్లుమనె**
**గుభిల్లుమనె గుండె నృపులకు**
**ఝల్లుమనియె జానకీ దేహము...**
**ఒక నిమేషమ్మునందె నయము జయమును**
**భయము విస్మయము గదురా**
**శ్రీమద్రమారమణ గోవిందో హరి**

**వచనం:**

భక్తులందరూ చాలా నిద్రావస్థలో ఉన్నట్టుగా ఉంది మరొక్కసారి... శ్రీమద్రమారమణ గోవిందో హరి! భక్తులారా! ఆవిధంగా శ్రీరామచంద్రమూర్తి శివ ధనుర్భంగము కావించినాడు.

అంతట – పద్యం: పోతగారిది:

**భూతలనాథుడు రాముడు ప్రీతుండై పెండ్లియాడె**
**పృథుగుణమణి... సంఘాతన్...**
**భాగ్యోపేతన్ సీతన్**
**భూతలనాథుడు రాముడు ప్రీతుండై పెండ్లియాడె!**
**శ్రీమద్రమారమణ గోవిందో హరి**

ఈ హరికథా ప్రారంభంలో వచ్చిన శ్లోకం పూర్వం మన హరిదాసులు ఆలపించే సంస్కృత శ్లోకం. భూతలనాథుడు... అనే కంద పద్యం బమ్మెర పోతన రచించిన భాగవతం లోనిది. 'ఫెళ్లుమనెవిల్లు'... అనే గీతపద్యం కరుణశ్రీ రచించినదని ఈ హరికథను శ్రీశ్రీ స్వయంగా తెలిపారు.

అందుకే ఘంటసాల వంటి కంఠస్వర సాల మరల పుట్టడు మహిన్! **– 'గోటేటి'**

SOUTHERN TRAVELS
happy holidaying...
SOUTHERN TRAVELS PVT.LTD.
(Recognised by Ministry of Tourism, Govt. of India) Since 1970
18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi - 05.
Tel. : 011-4353 2800 (100 Lines), 2875 3466
Fax : 011-2875 7308, 4250 2090
e-mail : info@southerntravels.in
Winners of National Award as "The Best Domestic Tour Operator"
2 Times in a row securing 1st Position in India from the Ministry of Tourisim, Govt. of India
Book online through www.southerntravels.com
Our Tour Packages, Hotels in India & Domestic / Flight Tickets
Chennai : 044-2538 5253 Mumbai : 022 - 2501 0027
Vijayawada : 0866 - 257 6624 Vizag : 0891 - 274 5565
Bangalore : 080 - 2226 2633, Hyderabad : 040 - 2331 8866

క్రొత్త ఢిల్లీలో ఆంధ్రా హోటల్ HOTEL SOUTHERN
ఢిల్లీలోని తెలుగువారి ఏకైక వాణిజ్య సంస్థ
HOTEL SOUTHERN
style. comfort. enjoy.
ఆధునిక ప్రయాణ సౌకర్యాలతో, ఉత్తర భారత యాత్రలు నిర్వహిస్తూ ప్రతి తెలుగింటా సుపరిచితమైన సదరన్ ట్రావెల్స్ వారి అనుబంధ సంస్థ "HOTEL SOUTHERN, Karol Bagh, New Delhi లోని ప్రముఖ వ్యాపార కూడలిలో, అధునాతన సౌకర్యములతో నిర్మింపబడి, 100 రూములు, Business Centre, విజయవాడ / అమరావతి రెస్టారెంట్లు గల హోటల్ సదరన్‌లో విడిది చేయగలరు.
Free pick up from Nizamuddin / New Delhi Railway Stations and Domestic Airport

# ముఖ్యమంత్రులెవరూ చేయని మంచి పనులను వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఒక్కడే చేసాడు!!

**మనిషి ఎంత చెడ్డవాడు**
**బ్రతికున్న మనిషిలోని**
**మంచినెపుడు గుర్తించడు సరికదా**
**చచ్చిన మంచి మనిషికి దోషమాపాదిస్తాడు!**

– ఆంధ్రదేశంలో దృశ్యాదృశ్యంగా ఉన్న కాంగ్రెస్‌ను తన పాదయాత్రల ద్వారా అధిక ప్రాధాన్యతకు తెచ్చాడు. ఎందరో పార్లమెంటుకూ, అసెంబ్లీకు ఎన్నికయ్యేట్టు కృషి చేసినవాడు అతడే. జల సదుపాయం లేనిదే వ్యవసాయం, జన జీవనమూ, రైతులూ ఉండదని భావించాడు. ఒకే పర్యాయంలో అనేక నీటి పారుదల ప్రాజెక్టులను ప్రారంభించి, లేనిపోని శ్రమను తల పైకెత్తుకున్నాడు, రాజశేఖరరెడ్డి అవిశ్రాంతంగా పనిచేసాడు. ఆ పరిశ్రమల వారికిది దోచిపెట్టాడు, ఈ పరిశ్రమల వారికి ఈ భూములిచ్చాడు, భూమిని తన యిష్టం వచ్చినట్టు ధారాదత్తం చేసాడంటే పరిశ్రమలెలా వస్తాయ్. కలకత్తాలో 'తాతా' వారి 'నానో ప్రాజెక్టుకు కమ్యూనిస్టు ప్రభుత్వం భూమి ఇవ్వరాదని, మమతా బెనర్జీ ఎదురుతిరిగితే, గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడి తానిస్తానని 'టాటా' వారిని తన రాష్ట్రానికి రప్పించుకున్నాడు. బెంగాల్‌కు టాటా చెప్పించాడు. ఏ పారిశ్రామికుణ్ణీ ప్రోత్సహంచకపోతే రాష్ట్రాభివృద్ధి ఎలా జరుగుతుంది? ప్రభుత్వం చేసే ప్రతీ కార్యక్రమానికి విఘ్నం కలుగచేసే 'మీడియా' పెరిగింది.

అడిగిన అట్టడుగు వర్గాలకన్నీ వై.యస్. సదుపాయాలు చేసారు. క్రైస్తవ మతం తీసుకున్ననూ హిందూ ఆలయాలనన్నిటినీ అభివృద్ధి చేసాడు. రెడ్డి, కమ్మ, కాపు, తెలగ అభిమానాలకు ముక్కుతాడు వేసాడు. బ్రాహ్మణుల్లోని అణ గారిన వర్గాలను ఆదుకుంటానన్నాడు. తెలుగు భాషను క్లాసికల్ భాషగా గుర్తిం చేట్టు చేయమన్నవారి కోరికల్ను నిమిషాల మీద ఢిల్లీ నుంచి సాధించి పెట్టాడు.


ప్రపంచ తెలుగు సమాఖ్య, విశాఖపట్టణంలో 'తెలుగు మ్యూజియమ్' ఏర్పాటు చేసుకుంటామంటే వారు కోరిన మంచి చోట సువిశాల స్థలము నివ్వడమే గాకుండా, 'వుడా' వారిని సమాఖ్య కోరిన విధంగా భవనం కట్టిపెట్టమని ఆదేశిస్తూ, భవన నిర్మాణం పూర్తయ్యేట్టు చేసాడు.

అఖిల భారత తెలుగు సమాఖ్య చెన్నయ్‌లో యావద్దేశ తెలుగు మహా సభలను జరిపించమని కోరితే, పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం ద్వారా జరిపించి, తాను సభలకు స్వయంగా వచ్చి పాల్గొన్నాడు. మద్రాసులో తెలుగు అకాడమీని స్థాపించవలెనని కోరితే అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధిని స్థలం యివ్వమనీ, తాను భవన నిర్మాణం చేస్తానని ముందుకు వచ్చాడు. ప్రతిపక్షాలు ఆ మీడియాకు కొమ్ము కాస్తూంటే, తన పార్టీ, తన కార్యక్రమాలకూ, ఓ పత్రిక అవసరమని, ఓ దినపత్రిక, టి.వి.లను ప్రారంభించారు. పెద్దయెత్తున ప్రారంభించిన సాక్షి దినపత్రికకు ఉపకారం పొందినవారందరూ షేర్లు కొన్నారు. కాంగ్రెస్‌వారికీ ఓ స్వంత దినపత్రిక ఉందనే ధీమా కలిగింది. ప్రభుత్వ ప్రభుత్వేతర ప్రకటనలు విరివిగా రావడం ప్రారంభించాయ్. లాభాలు వస్తాయనో, కృతజ్ఞతాభావంతోనో షేర్‌హోల్డర్స్ అయ్యారు. పత్రిక ప్రారంభమే లక్షల ప్రతులతో ప్రారంభమైంది. అంతక్రితం ఉన్న పత్రికల ఎదుగుదల తగ్గిపోయింది. ప్రకటనలు, చందాదారులూ



ఎక్కువ సంఖ్యలో పత్రిక వైపు మొగ్గుచూపారు. దానితో పత్రికకు వైరి వర్గం ఏకమయింది. దోచుకుని తిన్నాడంటూ కలతలు లేపారు. కాళోజీ మహాకవి చెప్పినట్లు మనిషిలోని మంచితనం గ్రహించరు సరికదా – చచ్చిన మనిషిపై దోషమాపాదించే గుణం మారని సత్యమైంది. ●

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని మార్చినందువల్ల పరిస్థితులు మెరుగవుతాయని అభిప్రాయపడడంలో అర్థం లేదు. ఆయన ఇప్పటి పరిస్థితులకు కారకుడు కాడు. ఆయన్ను ఇరుకులో పెట్టినది స్వపక్షం, ప్రతికక్షులే సమస్యా కారకులు. ద్వేష, దోష, దౌర్జన్యాలే రాష్ట్రాన్నీ గతికి తెచ్చింది. కేంద్రం కూడా ఇందుకు బాధ్యులు. వారు వనరులు కూర్చి సరిదిద్దగలరు. వారు రాష్ట్రాభి వృద్ధికి ఆసక్తి చూపాలి.



# తెనుగు పద్యంలో ఎంత ఔదార్యం కనపడుతుందండీ!

ఆ రాజేంద్రుని బాహు పంజరంలో పసిడి రెక్కల రాజహంస చిక్కుకుపోయింది. దాని అందమో, కర్మమో! ఏడిస్తే ఫలముంటుందా? అతనిలో జాలి పుట్టించాలి. అతణ్ణి స్పందింపచేయాలి. అతని మదిలో ఔదార్యం పొంగి పొరలేట్టు చేయాలి.

**సీ॥ తల్లి మదేక పుత్రిక, పెద్ద, కన్నులు**
**కానదిప్పుడు, మూడు కాళ్ళ ముసలి**
**యిల్లాలు కడుసాధ్వి, యేమియు నెరుగదు,**
**పరమపాతివ్రత్య భవ్యచరిత;**
**వెనుకముందు లేరెవరైన చుట్టాలు,**
**లేవడి యెందేని జీవనంబు! గానక**
**కన్న సంతానంబు శిశువులు, జీవనస్థితి**
**కేన తాపలంబు,**
**కృపదలంపగదయ్యయో నృపదేణ్య!**
**యభయమీవయ్య ఓ తుహినాంశువంశ!**
**కావఁగదవయ్య యర్థార్థి కల్పశాఖి**
**నిగ్రహింపుమయ్య 'యోనిషధరాజ'!**

కవి పద్యం నడకను చూడండి! జాలి గొలుపు పదాలను చూడండి. ఆ రాజహంస ఆర్ద్రత చూడండి. సీస పద్యాన్నింత చక్కగా వ్రాయగల కవి మొనగాడెవరై ఉంటాడు **శ్రీనాథుడే!**

ముందుగా తన గురించీ, తన వృద్ధ జనని గురించీ, ఆలూ. పిల్లల గురించీ– ఎంతో జాలిగొలిపేట్టు చెప్పిందా హంస!

రాజా! మా అమ్మకు నేనొక్కణ్ణే పుత్ర సంతానం. మా అమ్మ అతి వృద్ధురాలు. కళ్ళు కనపడవు. తదుపరి నా భార్య పరమపతివ్రత, అమాయకురాలు. నేను లేకపోతే ఆమె బ్రతకలేదు. నా ముందూ వెనుక సాయం చేసే చుట్టాలు లేరు. పైగా నా కిద్దరు చిన్న పిల్లలు. పసికూనలు. వాళ్ళు లేకలేక కలిగారు. మాది పేదకుటుంబం. కుటుంబం గడవడానికి నేనొక్కడినే ఆధారం. జాలిగొనవయ్యా– చంద్రవంశ రాజోత్తమా– నా పాలిట కల్పతరువీవు! నన్ను విడిచిపెట్టవయ్యా– అంటూ ఆ రాజు హృదయాన్ని స్పందింప చేసి, ప్రసన్నుడు కావడంతో విడువబడింది. తరువాత ఊరికే ఉన్నదా– ఆ రాజు ప్రేమించే దమయంతికీ రాజుకీ రాయబారం నడిపి వివాహం జరిగేట్టు ప్రత్యుపకారం చేసింది.

# భారతదేశ భాగ్యలక్ష్మి ఆంధ్రదేశం-ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన ఆంధ్రుల త్యాగభావం ఆవిరియవుతూంది!!

భారతాంతర్గత ఆంధ్ర దేశ ప్రాకృతిక సంపద అపార జలసంపద, పాడి పంటల సమృద్ధీ, సమైక్యత, సస్యశ్యామల కోమలత్వం, నీతినియమాలు, సార్వర్ధరహితం, త్యాగశీలం, సత్యనిష్ఠ, ధర్మనిరతి, ధర్మపరాయణత్వమూ, దైవభక్తీ, కరెన్సీ నాణెములతో సంబంధము లేని సిరిపరాయణ జీవత్వమూ, ఆత్మగౌరవమూ, అన్నిటినీ, ఆంధ్రదేశము అన్ని ప్రాంతాల్లోనూ కోల్పోయినది దురదృష్టాన్ని కొనితెచ్చుకున్న రాష్ట్రంగా 2012 సంవత్సరం ప్రళయం సృష్టించిందంటే చరిత్ర తెలియనివారికి, సంస్కృతి మరచినవారికీ ఆశ్చర్యకరంగా ఉంటుంది.

**ప్రాణం పోవుట మృత్యువు కానేకాదు!**
**నరుడు అభిమాన హతుడైననాడె చచ్చు!**

– అన్న వానమామల వరదాచార్యులవారి మాట సత్యమనిపిస్తున్నది. జాతిపిత గాంధీగారు బ్రిటిష్‌వారిని వెనక్కి పంపడానికే సమయం వినియోగించలేదు; భారతీయ సాంస్కృతిక ఆధ్యాత్మిక వారసత్వాభ్యున్నతికి అహరహం ఆయన పోరాడి నందున, వారి కండగా, బలిమి కలిమిల సంపదగా, ఆంధ్రులందరూ తరతమ, ప్రాంత, వర్ణ బేధాలు లేకుండా, గాంధేయాన్ని గాండీవంగా భుజాన ధరించి, ధరణీ పోరాటం చేయడమే గాకుండా ధన, కనక, వస్తు ప్రాణాలను సహితమూ అర్పించారు. వృత్తి ఉపాదులనూ వదులుకున్నారు. ఆంధ్రులు త్యాగభావంతో పాల్గొననినాడు స్వాతంత్ర సమరం విజయదుందుభి మ్రోగించేది కాదు.

'అత్తమీద కోపం దుత్తమీద చూపించినట్లుగా, ఆంధ్రదేశంలో అనర్ధాన్ని పాలకులే కొనితెచ్చుకున్నారని కొందరంటున్నారు.

వై.ఎస్. జగన్‌ను జైలుకు పంపడం. అంతకు పూర్వమే పారిశ్రామికులను నేరారోపణ చేసి కారాగారాల్లో బంధించడం. దీర్ఘానుభవం గల ఐ.ఎ.ఎస్. అధికారులను కారాగృహంలో బంధించడం. మరి కొందరిని ఖైదుచేసి భీభత్సం సృష్టించడం. ఒకరిద్దరు మంత్రులను ఖైదు చేయడం. మరికొందరు మంత్రులపై నేరారోపణలను చేయడం. వీరిలో పాలనా సమర్థుడైన మంత్రిని కూడా ఖైదు చేసే ప్రయత్నం చేయడం, ఆయన రాజీనామా చేయడం. మిగతా మంత్రుల్లో గుబులు పుట్టడం అన్నీ ఘోర కలి ప్రభావమే. కాదు స్వయంకృతాపరాధం.

ఖైదీలుగా బంధించే కార్యక్రమం ఎంతవరకూ జరుగుతూందో తెలియదు గానీ, ప్రతి(క) పక్షాల్లో అధికార పక్షం పలచనైపోతుందని, రాష్ట్ర కాంగ్రెసుగానీ, అఖిల భారత (హైకమాండు) కాంగ్రెసు గానీ, ఆలోచించకుండా ఓ ఉప్పెనను సృష్టించింది. **అధికార కాంగ్రెసుచే నియమించబడిన ముఖ్యమంత్రి, యువకుడూ, శాసనసభాపతిగా సమర్థతను నిరూపించుకున్న గౌ॥శ్రీ కిరణ్‌కుమార్‌రెడ్డి గారి పరిస్థితిని త్రిశంకు స్వర్గంగా మారిందని అధికార కాంగ్రెసు గ్రహించడం లేదు.** ఇలా సమస్యలపై సమస్యలు సృష్టిస్తూంటే ఆయన ఎలా పాలన కొనసాగించగలగడనే ఆలోచనా ఎవరికీ లేదు.

**పత్రికలకూ, ప్రతిపక్షాలకూ, బుల్లితెర వారికీ కావలిసినది సమస్యలే తక్క దేశాభివృద్ధితో పనిలేదు.** అధికార పక్షం లొసుగులందచేయడం, కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే అవుతూవస్తున్నదని ఆర్థిక పరిస్థితి మారుతున్నదని గ్రహించాలి.

ఏ ముహూర్తాన తెలంగాణా ఉద్యమం 40, 45 రోజులుగా పాలన కుదిపి వేసిందోగానీ, రాష్ట్రం అప్పట్నుంచే కుదేలయింది. పరిశ్రమలు చతికిలబడ్డాయ్. విద్యుత్ కొరత, నిత్య ధరవరులూ పెరిగిపోయాయి. అన్నపూర్ణల్లాంటి ఆంధ్ర రాష్ట్రంలో మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగస్థులూ, నిత్యావసర ధరలు పెరిగి పోయేటప్పటికి ఆర్థిక క్షోభను తీర్చుకోలేని స్థితిలో ఉన్నారు. పంట పొలాలన్నీ రియల్ ఎస్టేటు వ్యాపారంతో బీడులైపోయాయి. పంట కాలువలు, పిల్ల కాలువల్లో నీరు లేదు. వరదలు వచ్చినప్పుడు నీటిని కాపాడుకొనే శక్తి ప్రభుత్వానికి లేక నదుల్లోని నీటిని సముద్రంలోకి విడిచి పెడుతూన్నారు. అంతస్తుల కంతస్తుల భవనాలు నిర్మాణం కారణంగా భూజలాలు నిండుకున్నాయ్. అడవుల సంరక్షణ లేదు. తీవ్రవాదుల సమస్య, వలసవాదుల పెరుగుదల, పశువుల్ని కబేళాలకు (మధ్యశాలకు) పంపడం, జీవరక్షణ అంటూనే గోవధ, పశువధలు, పంట దిగుబడి పెరుగుదల కోసం రసాయనక ఎరువులు, పురుగు సంహార మందులు వాడుతున్న కారణంగా, పౌరుల్లో వ్యాధులు, ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్లు రోగకారకమవుతున్నాయ్. గ్రామరాజ్యం, గ్రామాల్లోని చేతివృత్తుల్నూ, పట్టణాలూ, నగరాలు మ్రింగివేసాయ్. ఉమ్మడి కుటుంబాలు చివికిపోయినట్లు, పౌరుల మధ్య సఖ్యత చిక్కిపోయింది. ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని భారతీయతను నాశనం చేయడంలో ఆంధ్ర రాష్ట్రం తలమానికమైంది. మసీదులు, చర్చిల్లు దరికి వెళ్ళని ప్రభుత్వం హిందూ దేవాదాయశాఖ పేరిట దేవుళ్ళ సొమ్మును కాస్తూంది. కార్పొరేట్ ఆసుపత్రులు వచ్చి, ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తున్నాయ్. ఆయుర్వేదం, హోమియో వైద్యములు కూడా దోపిడీకి సిద్ధమయ్యాయ్. ప్రాచ్య విద్య (ఇంజనీరింగు వంటి విద్యలు) చదువుకున్న వాడెవరూ దేశంలో ఉండడానికి ఇష్టపడడం లేదు. విదేశాలకు వెళ్ళిపోతున్నారు. విజ్ఞానం కల్పించు విద్య లేదు. విద్యశాఖలో మాతృభాషాభ్యాసన లేదు. పాలనా విభాగాల్లోనూ లేదు. అసలు మాతృభాషపై ఏ రాజకీయ పక్షానికీ ఆసక్తి లేదు. పోషణ లేదు. విద్యనూ, వైద్యాన్నీ కొనుక్కోలేని స్థితిలో ఎక్కువ జనాభా ఉంది. ఈ దుస్థితి, దౌర్భాగ్యం, దరిద్రం, ఆంధ్రరాష్ట్రానికే పట్టింది.

సత్యసాయి బాబా వంటివారూ, వివేకానందులు వంటివారు వందమందైనా రాష్ట్రంలో పుట్టాలి. తెలుగు తల్లీ! నిన్నే గిట్టనివారున్నప్పుడు నీవు మాత్రం ఏం వి చేయగలవు? ●

## వైద్యరాజా! ఇంగ్లీషు వైద్యుడా! నమో నమః!

యముడు ప్రాణాలనే తీస్తాడు. ఓ ఇంగ్లీషు వైద్యరాజా! నీవు యమునికి మించినవాడవయ్యా! ఎందుకో ఓ కవిగారికి ఇంగ్లీషు వైద్యుడంటే చిరాకు పుట్టింది. పరాకు మాటల్లో కూడా ఆ ఇంగ్లీషు వైద్యుణ్ణే తలుస్తూ: **వైద్యరాజ నమస్తుభ్యం । యమరాజ సహోదరా । యమస్తు హరతి ప్రాణాన్ । వైద్య ప్రాణ ధనానిచ ॥** – అంటూ పద్యయుక్తంగానే నిదురలో పలువరించాడు.

కవిగారి భార్యామణి కంగారుపడి ఏంవిటండీ పలవరిస్తున్నారు? అంటూ ప్రశ్నించింది. కవిగారలా నిదురలోనే **వైద్యోనారాయణో హరిః** అన్నారు.

అదేంవిటండీ ప్రేలాపనలు? – అని కొంచెం ఘట్టిగా అడిగేసరికి – పై పద్యాన్ని చెబుతూ, భార్యకు అర్థం కాదనేమో ఏమో – "వైద్యరాజుకే నమస్కారం అంటున్నా. అతడు యమునికి సోదరుడు! యముడు ప్రాణాలు మాత్రమే తీస్తాడు. వైద్యుడున్నాడు చూశావా! ధనమూ, ప్రాణమూ రెండూ హరిస్తాడే! అంటూ పెదవుల్ని మూసేశాడు. భార్య ఆరునొక్క రాగంలో కొంపముంచావురో డాక్టరూ! ఆయన్ను తీసుకునిపోయావు. ఆయన ప్రాణంతో డబ్బూ తీసుకుని పోయావు. నేనెట్టా బతికేదిరోయ్ యముడా' – అంటూ రాగం తీసింది.

# పచ్చగడ్డి కోసుకొనే పడుచు అమ్మడోయ్! ఎండుగడ్డి చీర వచ్చింది పల్లె అమ్మడూ!!

చీర కట్టడంలో తెలుగు గ్రామీణ పడతులకున్న ప్రావీణ్యత మరెవ్వరికీ లేదు. చీరా సారీ పెట్టి పంపడం తెలుగింటి సాంప్రదాయం. ఏడు గజాల్నుంచీ, తొమ్మిది గజాల చీరలను కూడా ఆనాటి ఆడవారు కట్టేవారు. ఇప్పుడు అందరూ ఆరుగజాల చీరకే పరిమితమైపోతున్నారు. అయినప్పటికీనీ గద్వాల్ చీరలు తొమ్మిది గజాల చీరలు ఇప్పటికినీ వస్తూనే ఉన్నాయ్. వెంకటగిరి చీరలు కూడా 9 గజాల్లో వస్తున్నాయ్.

అరవై డెబ్బై ఏండ్ల క్రితం పండుగలూ, శుభకార్యాలకు పట్టుచీరలు కట్టకుండా వెళ్లేవారు కారు. కంచి పట్టుచీర, బెనారస్ పట్టుచీర, మైసూర్ పట్టుచీరల్లానే సిల్కు చీరలు కూడా వచ్చాయ్. రామాయణ కాలంలో సీత వనవాసానికి నార చీర కట్టుకుని వెళ్ళిందనే విషయం ఉన్నది. అరిటి దొప్పల నారతో చీరలు నేసేవారు. వాటిని పుజా పునస్కారములకు కట్టేవారు. పట్టుచీర, పట్టుపురుగును చంపిన దారంతో నేస్తారనీ, గంజీ గట్టా పెడతారని కొంతమంది శుచికీ, మడికీ పనికిరాదని అనేవారు. అటుపిమ్మట కొంతకాలానికి పట్టుచీరలు ఫరవాలేదనీ, శ్రీకృష్ణమూర్తి పట్టుపీతాంబరాలే కట్టేవాడనీ, అందువలన కట్టుకోవచ్చుననీ అంగీకరించారు; ఆచారంలోకి తెచ్చారు.

ఆరోజుల్లో మన పనివారు మగ్గాలపై నేసిన తొమ్మిది గజాల పట్టుచీరను అగ్గిపెట్టెలో పెట్టి పంపినట్లు కథలున్నాయ్. ఇదీ కథ కాదు వాస్తవం అంటూ ఒకాయన తాను నేసిన పట్టుచీరను అగ్గిపెట్టెలో పెట్టి, ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రదర్శించారు. అంతటి నైపుణ్యం కల పనివారు ఆంధ్రదేశంలో ఉన్నారని చెప్పుకోవడం ఆనందం కలిగిస్తుంది.

అంతకన్నా ఆశ్చర్యం ఏమంటే, గుంటూరులో ఒకాయన ఎండువరిగడ్డితో, ఆరుగజాల నిడివిగల చీరను అంచులతో సహా అందంగా నేసి, జిల్లా కలెక్టర్‌గారికి చూపడం ఆయన ప్రశంలందుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇటీవల ఢిల్లీలో ఇన్నోవేటివ్ ఫార్మ టెక్నాలజీలో ప్రకాశం జిల్లా వీరన్నపాలెంకు చెందిన మువ్వా చిన్నకృష్ణమూర్తి, మూడు సంవత్సరాలు శ్రమించి, ఎండు వరిగడ్డి పోచలతో ఆరుగజాల చీర, రవికలను తయారుచేసాడు. ఆ చీరకు చక్కని అంచులను కూడా నేసాడు. కేంద్ర వ్యవసాయ కృషి విజ్ఞాన్ అధికారులు కృష్ణమూర్తి ఎండుగడ్డితో చీరనేసిన పసిడితనానికి అబ్బురపడుతూ నేసిన చీరనంతా పరిశీలించి చూశారు. మామూలు నూలు చీరల వలె దృఢంగా



ఉండడం చూచి పతకాన్ని, జ్ఞాపికనూ బహూకరిస్తూ సెహబ్బాష్ అన్నారు. నిజానికిది విచిత్రమే కదా! ఎండుగడ్డి పోచలతో, నూలుతో నేసిన చీరలా తయారుచేయడం విశేషమేనని భావించిన, అతని మిత్రుడూ, గుంటూరు వాస్తవ్యుడూ, జాతీయ ఉత్తమ రైతు అయిన విజేత బంగారు శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ విష్ణుకు చిన్నకృష్ణమూర్తిని పరిచయం చేస్తూ అతడు నేసిన చీరనూ, అతనికిచ్చిన పతకం జ్ఞాపికలను చూపించడంతో వారు ఆశ్చర్యమూ, ఆనందమూ వ్యక్తం చేస్తూ అభినందించడం ఎంతో ప్రశంసించదగిన విషయం. ఆంధ్రదేశంలోనే కాదు, అఖిల భారతదేశంలో ఏ ప్రభుత్వమూ చేతివృత్తుల వారిని ప్రోత్సహించకపోవడం విచారించదగిన విషయం. రాజకీయ వైషమ్యాల సమయాన్ని తగ్గించి, చేతివృత్తులవారిని ప్రోత్సహించాలని రాజకీయ పార్టీలన్నిటికీ విజ్ఞప్తి చేస్తున్నాం. ●

## వేంకటాచలవిభుని కరుణ లేకున్నచో విశ్వవ్యాప్త తెలుగు పత్రికగా 'ప్రముఖాంధ్ర' వెలుగొందేది కాదు!

**శ్లో॥ సర్వజ్ఞ సకలామరార్చిత పదస్సప్తా చలాధీశ్వరః**
**సర్వాభీష్ట ఫలప్రదాన నిపుణః శశ్వత్ప్ర సన్నాననః ।**
**వేదాన్తైరనుమేయ సుందరవపుర్మోహాభిగమ్యస్సదా**
**కల్యాణంభవతాం కరోతు భగవాన్ పద్మావతీ వల్లభః ।**



– పద్మావతీ సమేత సప్తచలాధీశ్వరుడైన శ్రీనివాస ప్రభువు సకల దేవతలచేసదా పాదయుగళ పద్మార్చన పొందుతూనే ఉంటాడు. సర్వజనముల కోరికలను నెరవేర్చు సర్వసమర్థుడు. చిరునవ్వులతో విరాజిల్లు మోహన రూపంతో ముఖసౌందర్యం 'సర్వఏవ సువర్ణః' అను ఉపనిషద్వాక్యాను సారముగా చెప్పునప్పుడు సుందరాకృతి గల ఆ స్వయంభువుడు పుంసా మోహనరూపుడైన పురుషాడాయన! కావుననే ఎన్ని పర్యాయములు రెప్పలార్చక ఆయన్ను చూచిననూ తనివితీరదు. అట్టి అపార కరుణా సుందరమూర్తి, పద్మావతీ వల్లభుడైన సుందరవదనుడు, భక్తజన వరదుడైన వేంకట రమణుడు సర్వకాల సర్వావస్థలందు మంగళములొసగుచున్నాడు. కనుకనే మంగళకరమగు **ప్రముఖాంధ్ర**ను పదహారు సారస్వత షోడశ కళలతో మీకు అందచేస్తున్నందుకు – కలియుగ శ్రీనివాస భగవానుడు మీకు చిరకాలమూ మంగళములను గ్రహింపమని ఆగస్టు 4న ప్రార్థించాను. ●

# జి.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

భారతదేశంలో ముగ్గురు వ్యక్తులు కలిసికట్టుగా ఐదు నిమిషాలైనా పనిచేయలేరు. ప్రతి ఒక్కరూ అధికారం కోసం అర్రులు చాస్తారు. చివరికి మొత్తం వ్యవస్థ కుప్పకూలుతుంది.

- స్వామి వివేకానంద



పై వివేకానందుని సూక్తి ఆయన కొన్ని దశాబ్దాల క్రిందట చెప్పినది. ఆయనది ఎంతటి దూరదృష్టి, ఎంతటి దీర్ఘదర్శి. ఆయన ఎలా చెప్పారో. అలాగే జరుగుతోంది. మన దేశపు పార్లమెంటరీ ప్రజాప్రతినిధులు వీధికుక్కల కన్నా హీనంగా దెబ్బలాడుకుంటున్నారు. ఇంతమంది ప్రజలు మనకు ఓటు వేశారన్న భయం లేదు. ప్రజలకు జవాబు చెప్పాలన్న ఆలోచన లేదు. వీరు ఎంతమాత్రం ప్రజాప్రతినిధులు కారు. వారిది పెత్తందారితనంలా వుంది. వీరికి జవాబుదారీతనం (Accountability), బాధ్యత (Responcibility) లేదు. పైగా మనల్నేం చెయ్యగలరు అన్న ధీమా. ఐదేళ్ళలో ఎంత దొరికితే అంత దోచుకుందాం అన్న ఆలోచనా ఒక కోటికి ఎన్ని సున్నాలో తెలియనివారు కూడా లక్ష కోట్లు, రెండు లక్షల కోట్లు ప్రజల సొమ్ము తింటున్నారంటే, ఏమిటి వీరి ధైర్యం, ఎవరూ ఏమి చెయ్యలేరు అన్న ధీమా. మహా అయితే 6 నెలలు జైలులో వుండి బయటకు వచ్చేయచ్చులే అనే పొగరు. ఎంతకైనా బరితెగించిన నాయకులు. యధారాజా, తథాప్రజ అన్న చందంగా ప్రభుత్వం కార్యాలయాలలో కాని, అధికారులలోగాని పెరిగిపోయిన లంచగొండితనం. నాయకులు తినగా లేనిది మేము తింటే తప్పేమిటి అని తిరిగి అడగడం. ఎవరితో చెప్తావో చెప్పుకో అనే నిర్లక్ష్యం. ఇది ప్రస్తుత భారతదేశ పరిస్థితి. ప్రస్తుత ప్రభుత్వం అవినీతి ఊబిలో కూరుకుపోయింది. రోజూ స్కాములే. ఓప్రక్క ఈ అవినీతి మరోప్రక్క సెక్యులర్ పేరుతో హిందువులను హేళన చెయ్యడం, కించపరచడం, వారి గొంతులు నొక్కడం. అస్సాంలో ఈనాటి పరిస్థితికి కారణం కాంగ్రెసే. గత 20 సంవత్సరాలుగా బంగ్లాదేశ్ ముస్లిములు మనదేశంలోకి జొరబడి అసాంఘిక కార్యకలాపాలు చేస్తూ, దౌర్జన్యం చెయ్యడం దీన్ని ప్రభుత్వం చూసి చూడకుండా ఊరుకోవడం. చిలికి చిలికి గాలివాన అయినట్టుగా అస్సాం ప్రజలు అన్ని రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారు. వారి ఇంటిలో వారే అనాధలుగా ఉండవలసివస్తోంది. ఈమధ్య టీవీలలోను, పేపర్లలోను చూసే వుంటారు. బెంగుళూరు, చెన్నైలలో పనిచేసుకుంటున్న అస్సాం వాసులు మిక్కిలి భయాందోళనలతో వారి వూరికి తిరిగి వెళ్ళటం చూసే వుంటారు. అసలు వారందరూ వున్న ఊరు వదలి ఎందుకు వెళ్ళవలసి వచ్చినది. వారికి దొరకని ఉద్యోగం, తిండి ఎక్కడో వలస వచ్చిన బంగ్లా దేశీయులకి ఎలా దొరుకుతోంది. వారివెనుక ఎవరున్నారు. అసలు అస్సాంలో హింస జరిగితే దానికి ముంబయిలో ముస్లిము సంస్థలు నిరసన తెలపడం ఏమిటీ? ఎందుకు? 1500 మంది పాల్గొంటారని చెప్పి 15000 మంది వచ్చి మీడియా వ్యానునూ, పోలీసు వ్యానులు తగులబెట్టడం, పోలీసులను చితకగొట్టడం. నిరసన ప్రదర్శనకి కర్రలు, ఇనుప రాడ్‌లతో రావడం ఏమిటి? శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తానంటే అన్నా హజారేను వారం రోజులు జైలులో వుంచారు. శాంతియుతంగా నిరసన చేస్తూ యోగా చేస్తానంటే బాబా రామ్‌దేవ్‌ను అర్ధరాత్రి అరెస్ట్ చేసి అమాయక ప్రజలను చితకబాదారు. అదే ముస్లిములకు 1500 మంది వస్తామని చెప్పి 15000 మంది మారణాయుధాల్తో వస్తే కనీసం ఇంతవరకూ ఒక్కరిని కూడా అరెస్ట్ చెయ్యలేదు. ఇదెక్కడి న్యాయం? మామూలు ప్రజలకే ఇన్ని ప్రశ్నలు తడుతున్నాయి. ఒక ప్రభుత్వానికి ఇంతటి యంత్రాంగం వుండి ఈ చిన్న విషయాన్ని కనుగొనలేకపోతున్నారే. దీనికి కారణమేమిటి? ఈ దేశాన్ని విచ్ఛిన్నం చెయ్యడానికి ఎవరైనా పన్నుతున్న కుట్రా? భారతదేశం పరదాస్య బంధాల నుండి విముక్తియై సర్వ స్వతంత్ర దేశం కావాలని ఎందరో దేశభక్తులు తమ ప్రాణాలను దేశానికోసం త్యాగం చేసి, పోరాడి రెండు వందల సంవత్సరాల ఫలము, తపస్సు ఈ భారతభూమి. వారి త్యాగాన్ని మనం విస్మరించి, మన దేశాన్ని మనం అగౌరవపరుస్తూ సర్వనాశనం చేస్తున్నాం. పెద్దలందరూ కౌరవ సభలో పెద్దలులాగా చూస్తూ కూర్చున్నారు. మన నాయకులు తెల్లదొరల కన్నా హీనంగా వున్నారు. మన జాతి ఆయువు పట్టులను హరిస్తూ, జాతినంతటినీ నిర్వీర్యులుగా చేస్తూన్నారు. పాశ్చాత్య దేశాలను అనుకరిస్తూ, భోగపరములైన పాశ్చాత్య ఆదర్శాలను అనుకరిస్తూ, ఇంద్రియ భోగాలను అనుభవిస్తూ కొందరు నాయకులు లక్షలకొద్ది వుండవచ్చు. కాని నా మాతృభూమిని, నా మతధర్మాన్ని సత్యమని నమ్మే, ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కచెయ్యక, సమస్త శక్తులు ఒడ్డి పోరాడే మహనీయులు కొందరు వుంటారు. వారికి మన పూర్తి సహకారాన్నిద్దాం. వారికి అండగా నిలుద్దాం. భరతమాత మనల్ని కాపాడుతుంది. అనుగ్రహిస్తుంది.

⁂ ⁂ ⁂

## మలేషియా తెలుగు సంఘం అధ్యక్షుడు అచ్చయకుమార్‌కు ఆ దేశపు రాజుచే "దత్తో" పురస్కారం



ఏ దేశమేగినా, ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని – అన్న మాటలను విన్నప్పుడు నాకు డాక్టర్ అచ్చయ్య కుమార్ (మలేషియా), సంజీవ అప్పడు (మారిషియస్) వంటి వారలు గుర్తుకువస్తూ వుంటారు. వారు ముందుగా భారతీయులు, తరువాత తెలుగుతల్లి ముద్దుబిడ్డలు. ఇంక అచ్చయకుమార్ గారి గురించి చెప్పవలసి వస్తే ఆయన నిమిషం కూడా తీరికలేని డాక్టర్. ఏదో రాయాలనో లేక ముఖస్తుతికో అంటున్న మాటలు కావివి. నేను మలేషియా వెళ్ళినప్పుడు ఆయనను కలవాలని ఆయన క్లినిక్‌కు వెళ్లాను. ఆయన ఎంతో సాదరంగా రిసీవ్ చేసుకుని ఇంకా పేషెంట్లు వున్నందు వల్ల కాసేపు వుండండి అంటూ అక్కడనుంచి ఆయన నిర్వహిస్తున్న తెలుగు సంఘం తాలూకు విశేషాలన్నిటిని తెలిపారు. ఇంకో నలుగురయిదుగురు తెలుగు మిత్రులు ఉన్నపళంగా రమ్మని లంచ్ కూడా ఏర్పాటుచేసారు. ఆయన మలేషియా తెలుగు సంఘం అధ్యక్షులయ్యాక తెలుగువారికోసం ఎన్నో కార్యక్రమాలు ముఖ్యంగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను గూర్చి అక్కడ అందరికి తెలిసేలా చెయ్యడం, తెలుగు పండుగలను సంబరంగా చేసుకోవడమే కాకుండా, కౌలాలంపూర్‌లోని 'పుత్ర జయ సెంటర్'లో కనీసం 15000 మంది సరిపడే హాల్‌లో మలేసియాలో తెలుగువారు కాలుపెట్టి 150 సంవత్సరాలయిన సందర్భంగా ఒక పెద్ద సభను ఏర్పాటుచేశారు. ఆ సభకు అక్కడి ప్రధానమంత్రిగారు హాజరయ్యి అంతవరకూ భారతీయులంటే తమిళవారుమాత్రమే అనే అపోహ వుండేది. ఇంతమంది తెలుగువారిని ఒక సభలో చూడటం అరుదైన విషయమే. ఇంతమంది తెలుగువారిని చూసి తెలుగువారికివ్వ వలసిన గౌరవాన్ని ఇస్తూ ఒక తపాల బిళ్ళను కూడా విడుదల చెయ్యటం ఇవన్నీ అచ్చయకుమార్‌గారి కృషి. పట్టుదలకు నిదర్శనం. ఆయన భారతదేశంలో జరిగిన తెలుగు సభలకు రావటమే కాకుండా మలేషియా నుండి కొంతమంది తెలుగువారిని కూడా ఒక డెలిగేషన్ తీసుకువస్తూ వుంటారు. తెలుగు సభలలో అచ్చు తెలుగువాడి గోచికట్టు పంచెతో కనిపిస్తూ వుంటారు ప్రముఖాంధ్ర మలేషియా పాఠకులు చాలామంది ఆయను తెలుగువారి కోసం చేస్తున్న కృషిని చెపుతూ వుంటారు. ఇంతగా ఎవరూ కష్టపడలేదని కూడా చెప్పారు. అలాగా అందరి మనస్సులను ఆకట్టుకున్నారు అచ్చయ్యకుమార్. ఇటీవల ఆయనకు మలేషియా రాజు "దత్తో" PJN అని గౌరవ పురస్కారాన్ని ఇచ్చారు. డాక్టర్ అచ్చయకుమార్ మలేషియా తెలుగు ప్రజలకు జరిపిన అవిరళ కృషికి, ఈ బిరుదును ప్రదానం చేసిన సందర్భంగా ప్రముఖాంధ్ర తరఫున ఆయనను అభినందిస్తున్నాం.

⁂ ⁂ ⁂

120 కోట్ల జనాభా కల భారతదేశంలో ఒలింపిక్స్‌లో ఒక్క బంగారు పతకాన్ని కూడా సాధించుకోలేకపోయాం. ప్రభుత్వం సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవటమే దీనికి కారణం. ఎన్నో వృధా ఖర్చులు చేస్తున్న ఈ ప్రభుత్వం, క్రీడలకు సంబంధించి శ్రద్ధ తీసుకపోవడం బాధాకరం. పొరుగున వున్న చైనా 40 బంగారు పతకాలను సాధించింది. మన దేశం తరఫున ఆరు పతకాలు వెండి, కాంస్యం గెలుచుకున్న క్రీడాకారులు చిన్న రాష్ట్రాల నుంచి వచ్చినవారు. సరైన ప్రోత్సాహం ఇస్తే ప్రపంచంలో మనం కూడా నెంబర్ వన్ కావచ్చు. క్రికెట్‌కు ఇస్తున్న ప్రాధాన్యతలో సగమైనా మిగిలిన ఆటలకు ఇస్తే బాగుంటుంది. ఒకానొకప్పుడు హాకీ ఆటలో నెంబర్ వన్‌గా వుండేవాళ్ళం. ఈసారి ఒక ఆట కూడా గెలవలేకపోయాం. కనీసం ఆటలపట్ల ఆసక్తి వున్న మంత్రులను నియమిస్తే బాగుంటుంది. ఇంతమంది కలిసి క్రికెటర్లను తిట్టిపోస్తున్నా ఈసారి క్రికెట్ సీనియర్లలో ప్రపంచకప్, జూనియర్లలో ప్రపంచ కప్ రెండూ మనవి కావడం సంతోషం కలిగిస్తోంది. వారిని అభినందిద్దాం. ●